మే 2023
రు.20/-

# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక



## నూతన సెక్రటేరియట్ భవనం

# హనుమజ్జయంతి శుభాకాంక్షలు





# చైతన్యం
సంకల్ప బలం


సామాజిక విలువల మాస పత్రిక

మే 2023

వ్యవస్థాపక సంపాదకురాలు
**తీగవరపు శాంతి**

సంపుటి -12 సంచిక - 8


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| శంకర | 7 |
| పూరీ జగన్నాధస్వామి వైభవం | 10 |
| ఒక శ్లోకం ఒక కథ | 14 |
| తెలుగు సరస్వతి | 16 |
| ఆంజనేయం మహావీరం | 18 |
| హితోక్తులు | 23 |
| సహస్రచంద్ర దర్శన సాహిత్య తపస్వి ఆచార్య ఎస్వీ రామారావు | 24 |
| ఉసురు తీస్తున్న ముసురు | 27 |
| సువర్ణయోగం | 28 |
| జంట పావురాలు | 31 |
| హృదయ (ని)వేదన | 33 |
| సంభాషణ సంస్కృతం | 34 |
| కాశీ క్షేత్రం | 40 |
| ఆత్మ నివేదనం | 43 |
| మాతృదేవో భవ | 45 |
| గళ్ళనుడి కట్టు | 48 |
| వింతపరీక్ష | 50 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## ట్యాంక్ బండ్ పై దేశంలోనే అతిపెద్ద 'అంబేద్కర్ విగ్రహం"

హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై, హైదరాబాదు నడిబొడ్డున 36 ఎకరాల్లో అంబేద్కర్ స్మృతివనం. 125 అడుగుల పొడవైన 'అంబేద్కర్ విగ్రహం" ఏప్రియల్ 14వ తేదీన ఆవిష్కరించడం ప్రజలంతా గర్వించవలసిన విషయం.

ఈ అత్యంత భారీ విగ్రహానికి జీవం పోసింది 98 సంవత్సరాల వయసున్న విశ్వకర్మ "రాంజీ సుతార్ ". ఈవిశ్వకర్మ మహారాష్ట్రలోని ధూలే జిల్లాలోని గోండూరు గ్రామానికి చెందిన వారు కావడం విశేషం. వారి చేతిలో జీవం పోసుకున్న భారీ విగ్రహానికి కావలసిన లిస్ట్ తెలిస్తే ఆశ్చర్య పోక తప్పదు. ఎక్కడ జీవం పోసుకున్న విగ్రహం కనిపిస్తుందో, అక్కడ స్థపతి రాంజీ సుతార్ చేతిలో జీవం పోసుకున్న విగ్రహం ఉంటుంది అనేంతగా రాంజీ ప్రసిద్ధి చెందారు.

ప్రపంచంలోనే అతి పెద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఆవిష్కరించింది కూడా స్తపతీ రాంజీ సుతారే. అంతేకాదు సితార్ నిర్మించిన ఎన్నో విగ్రహాలు, ప్రతిమలు మన దేశంలోనే కాక విదేశాలకు కూడా తరలి వెళ్లి, అక్కడ కూడా మన చరిత్రకు కీర్తి ప్రతిష్టలు తెస్తున్నాయి అనడంలో సందేహం లేదు.

హైదరాబాద్ ట్యాంక్ బండ్ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. భారత రాజ్యాంగ నిర్మాత , స్పూర్తి ప్రదాత ..డాక్టర్ .బి ఆర్ . అంబెడ్కర్ విగ్రహ ఆవిష్కరణ , ఆయన జయంతి రోజే జరగడం చరిత్రలో నిలిచిపోయేరోజు. అంతే కాదు బిఆర్ఎస్ అధినేత తెలంగాణా సీఎం కేసీఆర్ ఆవిష్కరించడం మరో చారిత్రకం. బాబా సాహెబ్ అంబెడ్కర్ మనవడు ప్రకాశ్ అంబెడ్కర్, బౌద్ధ గురువులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బౌద్ధ గురువులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. తదుపరి ఫోటో ఎగ్జిబిషన్ ను సీఎం కేసీఆర్ , ప్రకాశ్ అంబెడ్కర్ , మంత్రులు , ప్రజా ప్రతినిధులు , తిలకించారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు తెలంగాణా వ్యాప్తంగా జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఒక వైపు బుద్ధుడు, మరోవైపు అంబెడ్కర్ మహనీయుల విగ్రహాలు ఉండగా, ఇంకో వైపు బిర్లా మందిర్ ప్రజలకు కనువిందు చేస్తోంది.

ప్రముఖ పుణ్య క్షేత్రం అన్నవరం సత్యనారాయణ స్వామి వారి దివ్య కళ్యాణోత్సవం మే 2వ తేదీ సోమవారం రాత్రి అత్యంత వైభవోపేతంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను ఆనందభరితులను చేశారు, ఆ సత్యనారాయణ స్వామి గుడి కమిటీ సభ్యులు.

## సింహాద్రి అప్పన్న కొండపై ప్రజల అవస్థలు

చందనోత్సవం వేళ ప్రజలు దర్శనానికి లైన్లలో నుంచుని దర్శనాలు చేసుకోలేక, తీవ్ర ఇబ్బందులకు లోనైయ్యారు. ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చెయ్యలేదు. ప్రజలకు తాగేందుకు నీరిచ్చే దిక్కు లేక భక్తులు సొమ్మసిల్లి పడిపోయారు. దర్శనానికి ఎందుకొచ్చామా అని పెద్ద వారి దగ్గరనుండి, చిన్న వారి వరకు అనేక ఇబ్బందు-

లు పాడారు. ఇకనైనా ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చెయ్యవలసిన అవసరం ఎంతైనా ఉంది .

భగభగమంటున్న సూర్యుడు

ఎండలు నిప్పులు కురుస్తుంటే ప్రజలు ఆ వేడిని భరించలేక అల్లాడుతున్నారు. రోడ్లన్నీ ఖాళీగా బోసిపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో , ఇటు తెలంగాణలో ప్రజలు ఎండలకు తాళలేక పోతున్నారు. దానికి తోడు ఆంధ్రప్రదేశ్ లో పవర్ కట్. ప్రజల పరిస్థితి వర్ణించలేం. ఎండలకు తాళలేక ముంజులూ, కొబ్బరి బొండాలు, మామిడి పళ్ళు తింటూ సేద తీర్చుకుంటున్నారు ప్రజలు. ఇక మామిడి పళ్ళ సంగతి కి వస్తే వడగల్ల వాన పడడంతో మామిడి పళ్ళు దెబ్బతిన్నాయి. దాంతో వ్యాపారులు ఆ కాయలకు మందులు వేసి పండిస్తే, అవి పచ్చగా రంగు రావడంతో ప్రజలంతా అవి చాలా బావున్నాయి అని కొనుక్కుంటున్నారు. తీరా అవి తిని చుస్తే పులుపు. ఇంకొక్క రోజు ఉంటే పాడై పోవడం. దాంతో పళ్ళు కనిపించినా, ఈ సంవత్సరం ఎవ్వరు మామిడి పళ్ళు సరిగ్గా తినలేక పోతున్నామని వాపోతున్నారు.

ఇక ప్రభుత్వాలు ఇంటి పన్నుల రేట్లు పెంచి, ప్రజలభారం పెంచుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ లో అయితే పన్నులు పెంచి, పేదవారికి ఉచితంగా ఇస్తున్నారు తప్ప, అభివృద్ధి కార్యక్రమాలు చెయ్యడం లేదు అని అక్కడ ప్రజలు వాపోతున్నా రు. అలాగే ఇంటి పన్ను వేలలో కడుతున్న ప్రజలకు ఇంటి ముందు మురికి వాసన అలాగే ఉంటోంది అని ఆంధ్రప్రదేశ్ లో పలు ప్రాంతాల్లో ప్రజలు ఆరోపిస్తున్నారు. ఓట్లు కోసం ఈ రాజకీయ నాయకులకు ఉన్న శ్రద్ధ దేశాన్ని అభివృద్ధి చేద్దామని, ప్రజలకు ఉపాధి మార్గం చూపిద్దామని లేదు అని ఆందోళన చెందుతున్నారు. ఉచితంగా ప్రభుత్వాలు ఓటు రాజకీయాలు నడుపుతుంటే, ప్రజలు సోమరులై, తాగుబోతులుగా తయారవుతున్నారు, మేము కట్టే పన్నుల సొమ్ముతో అని మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు .

రోడ్ల విస్తరణ

రోడ్ల విస్తరణ బాగా చేస్తున్నారు, రోడ్డు బాగా వేస్తున్నారు కానీ directions సరిగ్గా ఇస్తూ, పెద్ద పెద్ద ఫ్లెక్సీబోర్డులు పెట్టకప్రజలు ఇబ్బందిపడుతున్నారు.అలాగే ఊరు పేర్లుసరిగ్గా వివరంగా, ఇస్తూ వెళ్ళే మార్గంగుండా పెద్ద పెద్ద అక్షరాలతో ఫ్లెక్సీలు పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. రాజకీయ నాయకుల, రకరకాల ప్రచారాలకు, సినీమా లకు సంబంధించి పెడుతున్నారు తప్ప, రోడ్డు మార్గం తెలియక ఇబ్బంది పడుతున్నాము అని ప్రజలు బాధపడుతున్నారు..

ఇక తెలంగాణా నాగోల్ బండ్లగూడ ప్రాంతాల్లో అయితే కుక్కల బెడద ఎక్కువగా ఉందని, మాకు బయటకు రావాలంటేనే భయంగా ఉంటోందని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, మమ్మల్ని కరిచి, చాలా ఇబ్బంది పెడుతున్నాయని అంటున్నారు.

వేడెక్కిన ఉత్తర తెలంగాణా



జిల్లాల్లో 43. 6 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు ఉత్తర తెలంగాణలో నెల రోజులుగా సాధారణం

కన్నా తక్కువ నమోదైన ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. హైదరాబాదు-తో పాటు పరిసర జిల్లాల్లో కూడా 37 డిగ్రీల నుండి 41 డిగ్రీల నమోదవుతున్నాయి.

రహదారులపై నిర్వహించే ఊరేగింపులు -- ధర్నాలు

భారత దేశం స్వాతంత్రం సాధించుకునే క్రమంలో రహదారులపై నిర్వహించిన ఊరేగింపు-లు ధర్నాలు, సత్యాగ్రహాలదే కీలక పాత్ర. మన రాష్ట్ర రాజకీయ పరిశీలిస్తే, ఎన్నో పాదయా-త్రలు, ఊరేగింపులు, సమావేశాలు, రహదారులు, జాతీయ రహదారులపైనే నిర్వహించారు. సభలు, సమావేశాలు నిర్వహణ పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు.

ఆ హక్కును తీసివేసే ఎటువంటి జీవోనైనా తీవ్రంగా పరిగణించాల్సిందే. జీవో 1 న్యాయ పరీక్ష ముందు నిలవనందున దాన్ని కొట్టేస్తున్నాం అని హైకోర్టు ధర్మాసనం తెలిపింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, జస్టిస్ డీవీ-ఎస్ఎస్ సోమయాజులతో కూడిన ధర్మాసనం 43 పేజీలతో సంచలన తీర్పు ఇచ్చింది.

ఎటువంటి సభలు, సమావేశాలు, ధర్నాలైన ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ కలగా కుండా చేయాలి. అమెరికా వంటి ప్రదేశాలలో కూడా ప్రజల పనులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చేస్తారు. చివరకు డబ్బు కోసం లేదా సహాయం కోసం అర్ధించవ-లసినా, రోడ్డుకి పక్కగా ఉండి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా సహాయం కోసం అర్ధిస్తారు.

మన ప్రజలకు, రాజకీయ నాయకులకు స్వార్ధం ఎక్కువ అని చెప్పక తప్పదు దేశాభిమానులు అంటున్నారు. ఓట్ల కోసం రాజకీయ నాయకులు ప్రజల డబ్బుని పే-దవారికి ఎంతైనా పంచడానికి వెనుకాడరు, ఊరికే ప్రభుత్వం డబ్బులు పంచుతుంటే, ఊరికే మనకెందుకు పంచుతోంది? మనం ఎందుకు తీసుకోవాలి? అని ఆలో-చించని ప్రజలు. ఈ ఆలోచనా విధానం మారనంత వరకు, దేశం బాగుపడదు. ఇప్పుడు దేశం బాగుపడక పోతే ముందు తరాల గతి ఏమిటి? మనం మన కుటుంబాల కోసం దాచి ఇచ్చే సొమ్ము శాశ్వతం కాదు అని మనం గ్రహించాలి.

దేశ క్షేమమే మన క్షేమం అని ఆలోచిద్దాము. దేశ అభివృద్దే మన ముందు తరాలకు భవిష్య-త్తు అని ఒక్కసారి ఆలోచించి అడుగులు వేద్దామా?

## సర్వేజనా సుఖినో భవంతు



తీగవరపు శాంతి

# శంకర



పాలకుర్తి రామమూర్తి

ఆదిశంకరుల జయంతి సందర్భంగా.. వారి స్మరణలో....

"శ్రుతి స్మృతి పురాణానా మాలయం కరుణాలయం, నమామి భగవత్పాద శంకరం లోక శంకరమ్" అంటూ శంకరులకు నమస్కరిస్తూ...

దాదాపు 2500 సంవత్సరాల కన్నా ముందుగా కేరళలో తిరువాన్కూరు మండలంలో కాలడి గ్రామంలో శ్రీ శివగురువు- ఆర్యాంబ దంపతులకు విభవనామ సంవత్సరంలో వైశాఖ శుద్ధపంచమి నాడు జన్మించిన శంకరులు తనకు ఒక సంవత్సరం నిండక ముందే చక్కగా మాట్లాడడం, రెండవ సంవత్సరం నుండి చదవడం వ్రాయడం నేర్చుకున్నాడు. ఇలా చిన్ననాటినుండే అసాధారణ ప్రతిభను కనబరచిన శంకరులకు మూడవ సంవత్సరంలో తండ్రి గతించాడు.. 5 వ సంవత్సరంలో ఉపనయనం జరగగా 8 వ సంవత్సరంలో తల్లి అనుమతితో అమరకాంతం అనే గుహలో ఉన్న గోవింద భగవత్పాదులను దర్శించి వారిని ప్రార్థించి వారి అనుగ్రహంతో సన్యాసం స్వీకరించాడు. గోవింద భగవత్పాదులు శ్రీ శుకుని శిష్యులైన గౌడపాదుల శిష్యులు.

శంకరులు తనలో చైతన్య ప్రభను వెలిగింప చేసిన గోవింద భగవత్పాదాచార్యుల ఆదేశానుసారంగా మొదటగా విష్ణు సహస్రనామాలకు భాష్యం వ్రాసారు. శివజటాజూటం నుండి ప్రవహించిన గంగాప్రవాహంగా సాగిన శివానందలహరిని, ఆదిశక్తి స్వరూపస్వభావాలను ప్రత్యక్షం చేసిన సౌందర్యలహరిని ప్రకటించారు. వారు వెలువరించిన ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలు జిజ్ఞాసువుల పిపాసను తీర్చాయి. పద్మపాదులు, హస్తామలకులు, తోటకాచార్యులు తదుపరి కాలంలో శిష్యులుగా చేరి వారు ప్రతిపాదించిన అద్వైతాన్ని విస్తరించడంలో కృషి చేసారు.


అయితే ఇలాంటి యుగకర్తయైన మహనీయుని జయంతిని ఉత్సవంగా నిర్వహించుకోవడం వల్ల ప్రయోజనం ఏమిటి? అంటే.. వారు సమాజానికి ఏం చెప్పారు.. వారి నడత, నడక ఎలాంటిది.. దాని వల్ల మనం ఏం నేర్చుకుంటామో అవగాహన చేసుకుంటే, వారి బోధలను ఆదర్శప్రాయంగా తీసుకొని జీవితాలకు అన్వయించుకుంటే మన జీవితాలను సరిదిద్దుకునే అవకాశం ఉన్నది.

ఆదిశంకరుల అవతరణ నాటికి కాపాలికులు ప్రబలి నరబలులు ఇచ్చే సంస్కృతి పెరిగిపోయింది. నాస్తికుల ప్రాబల్యం పెరిగి భగవంతుని ఉనికిని ప్రశ్నించడం, వేద ప్రామాణ్యాన్ని నిరసించడం ఆరంభమయింది. మౌలిక స్వభావానికి, లక్షణానికి దూరమైన వివిధ మతాలు వికృతరూపాన్ని ధరించి, అస్తవ్యస్తంగా మారి, ఒకరినొకరు ద్వేషించడమే కాక భౌతిక దాడులను చేసుకోవడం.. ఎక్కువయింది. ప్రజల జీవితాలు భయానకమయ్యాయి. వేదబోధిత కర్మకాండకు విపరీత భాష్యాలు చెపుతూ, కర్మమార్గమే గొప్పదనే

"యజుర్వేదం" నుండి, "తత్త్వమసి" (అదే నీవు అయి ఉన్నావు) అనే మహావాక్యాన్ని "సామవేదం" నుండి, "అయమాత్మా బ్రహ్మ" (ఆత్మయే బ్రహ్మము) అనే మహావాక్యాన్ని అథర్వణ వేదం నుండి గ్రహించి వానిని అద్వైత సిద్ధాంతానికి అన్వయించారు, శంకరులు. ప్రజ్ఞానం బ్రహ్మ అనేది లక్షణం అన్నారు. తత్త్వమసి అనేది ఉపదేశం అంటూ చెప్పారు. అయమాత్మా బ్రహ్మ అనేది అనుసంధానంగా చెప్పారు. అహం బ్రహ్మోస్మి అనేది అనుభవంగా చెప్పారు. ఇలా తమ అద్వైత సిద్ధాంతాన్ని తార్కికంగా సమన్వయం చేస్తూ... వివిధ మతాలలోని మౌఢ్యాన్ని ఖండిస్తూ, అద్వైత సిద్ధాంతంలోని ఔన్నత్యాన్ని ప్రచారం చేస్తూ... ఆ సిద్ధాంతాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఆమోదింపచేసారు.

అద్వైతం అంటే సత్యానికి అంతిమమైన స్థితి. అద్వైతము అనగా రెండవది లేనిది అని అర్థం. వ్యవహారంలో మనం ముచ్చటించుకునే బ్రహ్మం, జీవుడు, జగత్ అని మూడు విషయాలు లేవు. ఉన్నది ఒక్కటే అదే బ్రహ్మము. కనిపించే ప్రపంచమంతా బ్రహ్మమునకు భిన్నము కాదు. సత్ చిత్ ఆనందము, అనంతము, ప్రజ్ఞానఘనము అయినటువంటి ఆ బ్రహ్మము "నేనే" అంటే జీవుడని చెపుతుంది అద్వైతం. అలా అంతా ఒక్కటిగా ఉన్న ఏకత్వమని చెప్పినప్పుడు సాధారణ జనాలకు ఒక అనుమానము కలుగుతుంది. ప్రపంచం సుఖము దుఃఖములనే ద్వంద్వాలతో కూడుకొని నానా విధములుగా కనబడుతున్నది. అలాంటప్పుడు దుఃఖితుడైన "జీవి" సచ్చిదానందమూర్తియైన బ్రహ్మముతో సమానమని చెప్పడం ఎలా పొసగుతుంది అనే అనుమానం సహజంగానే వస్తుంది. ఆ అనుమానానికి సమాధానంగా... "ఈ బ్రహ్మాన్ని ఆశ్రయించి ఆవరించిన మహత్తు లేదా మాయాశక్తి ఉండడం మూలంగా వివిధాలుగా కనిపించినా అంతా ఒక్కటే" అని చెప్పబడింది. దీనినే "అభాస" అన్నారు. నామరూపాత్మకమైన ఈ జగత్తు అంతా కూడా "మిథ్యా" అన్నారు. దీనినే "బ్రహ్మ సత్యం జగన్మిధ్య" అంటూ అద్వైత సిద్ధాంతంగా శంకరులు పేర్కొన్నారు.

ఉన్నదానికి భిన్నముగా మరొకటి ఉంటే భయం ఉంటుంది (ద్వితీయాద్వై భయం భవతి). భయం ఉంటే నిరతిశయానందాన్ని పొందడం కుదరదు. కాబట్టి అద్వైతం తప్ప మరొకదానితో మోక్షం లభించదని నిర్ద్వంద్వంగా చెప్పారాయన. రెండవది ఉంటే కదా భయం ఉంటుంది.. అందువల్ల భయరహితమైన జీవనం అద్వైతం వల్ల మాత్రమే సాధ్యమౌతుంది. జీవాత్మ, పరమాత్మల ఏకత్వ భావనే అద్వైత సిద్ధాంతానికి ప్రాతిపదిక. అందుకే .. ఆదిశంకరులు ఒక వైజ్ఞానిక మహాశక్తిగా చెప్పబడ్డారు. వారి అద్వైతసిద్ధాంతం జీవచైతన్య ప్రాధాన్యాన్ని తెలిపేదే కానీ జడాన్ని బ్రహ్మగా అంగీకరించలేదు. రసానుభూతి ఉన్నవాడే పరమాత్మ కానీ రసానుభూతి లేని జడము పరమాత్మ కాదు అంటారు శంకరులు. నిజానికి ఆదిశంకరులను సరిగా అధ్యయనం చేసి అర్థం చేసుకోగలిగితే భారతీయ ఋషులందరినీ అధ్యయనం చేసినట్లే. "అభయం ప్రతిష్ఠాం విందతే" "ఏ తస్మిన్నుదరమంతరం కురుతే" "అథతస్య భయంభవతి" అని చెపుతుంది తైత్తరీయ



"యజుర్వేదం" నుండి, "తత్త్వమసి" (అదే నీవు అయి ఉన్నావు) అనే మహావాక్యాన్ని "సామవేదం" నుండి, "అయమాత్మా బ్రహ్మ" (ఆత్మయే బ్రహ్మము) అనే మహావాక్యాన్ని అధర్వణ వేదం నుండి గ్రహించి వానిని అద్వైత సిద్ధాంతానికి అన్వయించారు, శంకరులు. ప్రజ్ఞానం బ్రహ్మ అనేది లక్షణం అన్నారు. తత్త్వమసి అనేది ఉపదేశం అంటూ చెప్పారు. అయమాత్మా బ్రహ్మ అనేది అనుసంధానంగా చెప్పారు. అహం బ్రహ్మోస్మి అనేది అనుభవంగా చెప్పారు. ఇలా తమ అద్వైత సిద్ధాంతాన్ని తార్కికంగా సమన్వయం చేస్తూ... వివిధ మతాలలోని మౌఢ్యాన్ని ఖండిస్తూ, అద్వైత సిద్ధాంతంలోని ఔన్నత్యాన్ని ప్రచారం చేస్తూ... ఆ సిద్ధాంతాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఆమోదింపచేసారు.

అద్వైతం అంటే సత్యానికి అంతిమమైన స్థితి. అద్వైతము అనగా రెండవది లేనిది అని అర్థం. వ్యవహారంలో మనం ముచ్చటించుకునే బ్రహ్మం, జీవుడు, జగత్ అని మూడు విషయాలు లేవు. ఉన్నది ఒక్కటే అదే బ్రహ్మము. కనిపించే ప్రపంచమంతా బ్రహ్మమునకు భిన్నము కాదు. సత్ చిత్ ఆనందము, అనంతము, ప్రజ్ఞానఘనము అయినటువంటి ఆ బ్రహ్మము "నేనే" అంటే జీవుడని చెపుతుంది అద్వైతం. అలా అంతా ఒక్కటిగా ఉన్న ఏకత్వమని చెప్పినప్పుడు సాధారణ జనాలకు ఒక అనుమానము కలుగుతుంది. ప్రపంచం సుఖము దుఃఖములనే ద్వంద్వాలతో కూడుకొని నానా విధములుగా కనబడుతున్నది. అలాంటప్పుడు దుఃఖితుడైన "జీవి" సచ్చిదానందమూర్తియైన బ్రహ్మముతో సమానమని చెప్పడం ఎలా పొసగుతుంది అనే అనుమానం సహజంగానే వస్తుంది. ఆ అనుమానానికి సమాధానంగా... "ఈ బ్రహ్మాన్ని ఆశ్రయించి ఆవరించిన మహత్తు లేదా మాయాశక్తి ఉండడం మూలంగా వివిధాలుగా కనిపించినా అంతా ఒక్కటే" అని చెప్పబడింది. దీనినే "అభాస" అన్నారు. నామరూపాత్మకమైన ఈ జగత్తు అంతా కూడా "మిథ్యా" అన్నారు. దీనినే "బ్రహ్మ సత్యం జగన్మిథ్య" అంటూ అద్వైత సిద్ధాంతంగా శంకరులు పేర్కొన్నారు.

(మిగిలినది వచ్చే సంచికలో)

# పూరి జగన్నాథ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



పూరి జగన్నాథుని రథయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైె నది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాథ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాథ క్షేత్ర మాహాత్మ్యాన్ని యధామూ లంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

- సంపాదకురాలు

**47,48,వ అధ్యాయాలు**

ఉపసంహారం.

విశ్వంలో ఉన్న ఐశ్వర్యాలన్ని పరమేశ్వరునికి చెందినవే.పరమేశ్వరుని ఏరూపంలో ఆరాధిస్తే అటువంటి ఫలితాన్నే ఇస్తాడు.ధర్మ మార్గాన్ని తెలుసుకోవడం ఎవరివలన కాదు.ఒక్క పరమాత్మే తెలుసుకోగలడు.

అర్ధ,కామాలు రెండు ధర్మాన్ని ఆశ్రయించి ఉంటాయి.ఈ మూడింటిని స్వామి అవలీలగా వృద్ధి చేయగలడు.విష్ణువు ధర్మ స్వరూపుడు.కనుక స్వామి యందు భక్తి కలవానికి దుఃఖాలు ఉండవు.కోరికలు ఉండవు.ఆత్మతృప్తితో ఉంటారు.( 1-9)

స్వామిని ఇంద్రుని రూపంలో ఉపాసిస్తే ముల్లో కాలలోని సంపదలను ఇస్తాడు. బ్రహ్మరూపంలో ఉపాసిస్తే వంశం వృద్ధి చెందుతుంది. సనత్కుమారుని రూపంలో ఉపాసిస్తే దీర్ఘాయువు కలుగుతుంది.భూమి రూపం లో అర్చిస్తే వృత్తి,సంపదలు ఇస్తారు. వాచస్పతి రూపం లో పూజిస్తే గంగాది తీర్థాల ఫలితాన్ని ఇస్తారు. సూర్యుని రూపంలో ఉపాసిస్తే చీకట్లను పోగొడతాడు.చంద్రుని రూపంలో ప్రార్ధిస్తే సౌభాగ్యం లభిస్తుంది. బృహస్పతి రూపంలో అర్చిస్తే విద్యతత్వం తెలుస్తుంది.యజ్ఞేశ్వరుని రూపంలో పూజిస్తే యజ్ఞఫలితం కలుగుతుంది. కుబేరుని రూపంలో పూజిస్తే సంపదలను ఇస్తాడు.!0-15



స్వామి నీలాద్రిపై అవతరించి అనాధులను రక్షిస్తున్నాడు. ఈ లోకంలోను,పరలోకంలోను సుఖాలు అనుభవించడానికి పురుషోత్తమ క్షేత్రానికి వెళ్లి స్వామిని అర్చించండి అనిజైమిని మునులకు



ఉపదేశించాడు. (16- 18)

ఇంద్రద్యుమ్నుడు స్వామికి ఉత్సవాలు,ఉపచారాలు నిర్వర్తించి, ధన్యుడైనట్లుగా భావించి,గాలరాజును పిలిచి ఈ విధంగా చెప్పాడు.

" రాజా!నీవు అనేక ధర్మాలను విన్నావు. భక్తి కలవాడవు.దీనులను రక్షించడానికి స్వామి ఇక్కడ అవతరించాడు.కనుక స్వామిని భక్తి శ్రద్ధలతో అర్చించు,స్వామి దేవాలయంలో ఏవిధంగా ప్రవేశించాడో నీవు ప్రత్యక్షంగా చూసావు.బ్రహ్మాది దేవతలు స్వామిని చూసి దిగ్భ్రాంతులయ్యారు.(1-11)

స్వామి ఇక్కడదారురూపంలో అవతరించారు. స్వామిని కల్పవృక్షం అని భావించు. కోరిన కోరికలు అన్ని స్వామి తీరుస్తాడు.జ్యోతి స్వరూపుడయిన ఈ స్వామిని యతీశ్వరులు ఒక్కరే చేరగలరు.స్వామిని అర్చిస్తే తాపత్రయాలు నశిస్తాయి.స్వామి ఇచ్చేఉపశమ నాన్ని లోకంలో ఎవరు ఇవ్వలేరు.(12-17)

రాజా! నీవు ప్రజలతో కలిసి స్వామిని అర్చించి యాత్రలు నిర్వహించు.నృసింహుని అర్చించు. మూడు సంధ్యలలోను స్వామిని అర్చించు.ఆనందాన్ని పొందుతావు" అని ఇంద్రద్యుమ్నుడు శ్వేతునికి ఉపదేశించాడు.(18-21)

శ్వేతుడు ఇంద్రద్యుమ్నుడు ఆజ్ఞను శిరసావహించాడు. ఇంద్రద్యుమ్నుడు నారదునితో కలిసి విష్ణు



లోకానికి వెళ్లిపోయాడు.

ఈ క్షేత్ర మాహాత్మ్యాన్నివిన్న వారికి వేయి అశ్వమేధ యాగాలు చేసిన పుణ్యం లభిస్తుంది. నూరు కపిలగోవులను దానం ఇచ్చిన ఫలితం కలుగుతుంది.

ధర్మం,యశస్సు,ఆయుష్షు,పుణ్యం,లభిస్తుంది. వంశం అభివృద్ధి చెందుతుంది.స్వర్గ నివాసం లభిస్తుంది.పాపాలు పోతాయి.(22-28)

ఈ వృత్తాంతాన్ని వైష్ణవులకు తప్ప ఇతరులకుబ్ చెప్పకూడదు.కుతర్కం చేసేవారికి,శ్రుతులు,ఆగమాలు చదవని వారికి,నాస్తికులకి,దాంభికులకు,ఇతరుల తప్పు వెతికేవారికి చెప్పకూడదు.(29-30)

స్కాంద పురాణంలోని వైష్ణవ ఖండంలోని పురుషోత్తమ క్షేత్ర వైభవంలో ఉపసంహారము అను నలభై ఏడు,నలభై ఎనిమిది అధ్యాయాలు సమాప్తం.



# ఓ శ్లోకం - ఓ కథ



"ఇంకా ఎంత చదువుతావూ?" రామబ్రహ్మం కొడుకు నవీన్ ని ప్రశ్నించాడు. నవీన్ కి 30 సంవత్సరాలు. నిత్య విద్యార్థి.

"కనీసం 15 డాక్టరేట్లు వచ్చేవరకూ!" చిద్విలాసంగా అన్నాడు.

"ఉద్యోగం సద్యోగం చెయ్యవా?": మరింత చిరాగ్గా అడిగాడు రామబ్రహ్మం.

"పాతిక తరాలకి సరిపడ్డ ఆస్తి నువ్వు సంపాయించి పడేశావు. రోజుకి లక్ష ఖర్చు పెట్టినా సముద్రంలో వానచుక్కే. అందుకే, ధనార్జన కంటే జ్ఞానార్జన మీద దృష్టి సారించా", తండ్రిని పెద్ద పట్టించుకోకుండా అన్నాడు నవీన్.

****

"నేను పది సెంట్ల యజమానికి ఐదో సంతానంగా పుట్టాను. జీవితం, అంటే, బాల్యం నికృష్టంగా నడిచింది. అందుకే ఇప్పటికి వెయ్యి ఎకరాలు సంపాయించాను. కనీసం వెయ్యి కోట్లకి పడగెత్తితే కానీ నా దాహం తీరదు. ఇష్టం వుంటే ఉండు, లేకపోతె పో!" భార్య వంక గుర్రుగా చూసి అన్నాడు గుర్నాథరెడ్డి.

""మీకసలే సుగరూ బీపీ. దానికి తోడూ రోజుకో లాలూచీతో టెన్షను. సంపాయించింది మనకి చాలదా? ఆరోగ్యాన్ని చంపుకుని ఆస్తులు కూడబెట్టడం దేనికీ?" అనునయంగా అన్నది మనోహరీ రెడ్డి.

"నా లక్ష్యం చేరేవరకూ హరిహర బ్రహ్మాదులు ఆగమన్నా ఆగను" ఛటాల్న లేచి ఆఫీసు రూములోకి పోయి తలుపు వేసుకున్నాడు






గుర్నాథరెడ్డి. గట్టిగా నిట్టూర్చింది మనోహరి.

****

"వాడు పక్కా నాస్తికుడు. గడ్డం మీద కురుపు లేచిందని నెలపాటు గడ్డం పెంచాడు. ఆ తరవాత ఏడాది పాటు గడ్డమూ జుట్టూ పెంచి భర్తృహరి సుభాషితాన్ని జనాలకి చెబుతూ మహాసన్యాసిగా తెగ డబ్బు సంపాయిస్తున్నాడు. నెలనెలా అప్పు చేస్తే గానీ గడవని వాడి కుటుంబం ఇప్పుడు మూడు పువ్వులూ ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఇన్నాళ్ళనుంచీ ఆ దేవుడ్నే త్రికరణ శుద్ధిగా నమ్మిన మనం మాత్రం ఎక్కడివాళ్ళం అక్కడే వున్నాం" నిరాశగా అన్నాడు మహీధరరావు.

"భక్తికీ డబ్బుకీ జత కట్టకూడదు బాబాయ్. వక్రమార్గం లో వచ్చేది నిలవదని పెద్దలంటారు" చిన్నగా అన్నది సువర్చల

"బాబాయ్...

'అస్థిరం జీవితం లోకే ... అస్థిరే ధన యవ్వనే అస్థిరా పుత్రదారాశ్చ... ధర్మ: కీర్తి: ద్వయం స్థిరం ' అన్నారు పెద్దలు. అంటే పుట్టిన జీవి మరణించక తప్పదు. లోకంలో ఏది సంపాదించినా ఇక్కడే విడిచి వెళ్లక తప్పదు. అది ధనమైనా, యవ్వనమైనా, పుత్రులు పౌత్రులు భార్యలూ అయినా, కేవలం బ్రతకడానికీ, పదవులూ పనులూ పొందడానికి నేర్చే విద్య అయినా, ఏదీ స్థిరం కాదు. మనిషి యొక్క ధర్మనిరతి అతడ్ని అమరునిగా కీర్తివంతునిగా చేస్తుంది. అందుకే యుగం మారినా, బలి చక్రవర్తి, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, వాల్మీకి, వశిష్టుడు, ప్రహ్లాదుడు, హనుమంతుడు వంటివారు ప్రజల నోళ్ళలో, హృదయాల్లో చిరంజీవులుగా నిలిచిపోయారు. కనుక చిన్నాన్నా మీ ఫ్రెండ్ విషయం వదిలేసి మీరు ప్రశాంతంగా ఉండండి" అన్నది సువర్చల.

సువర్చల మంచి ఉపాధ్యాయిని. అందరికీ మంచి శ్లోకాలను గుణంగా వివరిస్తూ వుంటుంది. 'ఈ శ్లోకాలు మనకి శాంతినిచ్చే అద్భుత దీపాలు' అంటుంది.

లోకాస్సమస్తాః సుఖినో భవన్తు

మళ్ళీ కలుద్దాం

మీ

భువనచంద్ర

# తెలుగు సరస్వతి

ఎలెక్ట్రాన్



అర్థంపర్థంలేని తల్లితండ్రుల మూర్ఖపుటాలోచనల్నీ, ఉద్యోగపుటారాటాల్నీ వంకలుగా తీసుకొని, స్వార్థపరులైన రాజకీయనాయకుల మద్దతుతో కుక్కగొడుగుల్లా మొలిచిన పాఠశాలల యాజమాన్యాల అధిక లాభాపేక్ష మూలంగా, బొడ్డూడని వయసునుంచి విశ్వవిద్యాలయాల స్థాయికెదిగేవరకూ విద్యానిలయాల్లో ఆంగ్లంలోనే బోధన జరుగుతోన్న కారణంగా, మాతృభాష అంతరించిపోయే ప్రమాదం ముంచుకొస్తోందని జనవాళిని హెచ్చరించే సద్భావనతో, వచ్చే ఉగాది పర్వదినాన అనగా తేదీ 22.03.2023న సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక తెలుగు భాషా సంస్థ ఆవరణలో, కేంద్రీయ తెలుగు భాషాసంస్థ అధ్యక్షురాలు హంసారాణి గారి అధ్యక్షతను నిర్వహించబడే మహాసభకు పురజనులందరూ విచ్చేసి, పాల్గొని, జయప్రదము గావించవలెనని కోరుతున్నాము ... ఇట్లు, .... స్థానిక తెలుగు భాషా సంస్థ. “ఓర్నాయనోయ్! ప్రకటనంతా ఒక సుదీర్ఘమైన వాక్యంలో ఉంది. దీన్ని చదవడానికి ఏ




జూనియర్ ఎన్.టి.ఆరో రావాలి! అందుకనే, ప్రతీకగా, ప్రోత్సాహకరంగా ప్రకటన పక్కన తాతా, మనవల రామారావుల పోస్టర్ పెట్టారేమో!” అనుకొన్నారు జనాలంతా. వాస్తవమేమిటంటే, ప్రాంతీయ తెలుగు భాషా సంస్థ అధ్యక్షుడికున్న కొనుగోలు అధికారం కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే. గాంధీ వస్త్రదుకాణ సముదాయంలో కొన్న తెల్లగుడ్డని కొనడానికే ఆ వెయ్యి రూపాయలూ చాల్లేదు. స్వంత ఖర్చుతో భార్యకి ఒక కొత్త పెద్దాపురం సిల్కుచీరకొని, ఆవిడ రెండు పాత తెల్లచీర్లను కూడా చింపి సభాసమాచారం వ్రాయించవలసిన దుర్గతి ఏర్పడింది. ఉన్న ముఫై ఇద్దరు పరిశోధనా విద్యార్థులను బ్రతిమాలాడి జవనికల మీద నీలిరంగులతో అక్షరాలు వ్రాయించి, మొత్తం నగరంలో ఉన్న ఇరవై రెండు చలనచిత్ర మందిరాల ముంగిటలోనూ, నాలుగు

బహుళ యవనిక చిత్రమందిరాల ప్రాంగణాలలోనూ సభా సమాచార పతాకలు వ్రేలాడదీయించాడు. తెలుగునాట చలన చిత్రమందిరాలకు పోయే జనాలు దరిదాపులుగా శతశాతం తెలుగు భార్యాభర్తలే, తెలుగు విద్యార్థులే, తెలుగువారే అయ్యుంటారు కాబట్టి, ఆ చలన చిత్రాల ప్రాంగణాలలో సమాచారముంచి, చిత్రమందిర యజమానులను బ్రతిమలాడి పక్కనే సంభాషణా దురంధురులైన తాతా, మనవలైన రామారావుల చిత్రాలుంచ

2

గలిగారు. ఈ సమాచార ప్రకటన నగరంలో ఉన్న ఏ విద్యాలయంలోనూ, ఏ వాణిజ్యకూడలిలోనూ, నీరుపెట్టక ఎండిపోయిన ఏ ఉద్యానవనాల పక్కనా పెట్టలేకపోయారు, ఆదినం సాయంత్రం సభామందిరం ఏభైమంది వయసులు మీరిన స్త్రీ పురుషులతో నిండిపోయింది. పరిశోధనా విద్యార్థులు గోడలకాని నిల్చున్నారు. స్వాగతవచనాలు, పరిచయాలూ జరిగిన తర్వాత హంసారాణి తన ఉపన్యాసం ఆరంభించింది. “మై డియర్ స్టూడెంట్స్, నగర సీనియర్ సిటిజెన్స్! ఎంతో ఇంట్రెస్ట్ తీసుకొని మీరందరూ ఇక్కడ సమావేశమైనందుకు వెరీ మెనీ థాంక్స్...... ప్రపంచీకరణ-అంటే గ్లోబలైజేషన్ అనే మాయాజాలంలో చిక్కుకొనిపోయి మన కంట్రీలోని ప్రతి



స్టేటూ తన కల్చర్నీ, మాతృభాషనీ మరిచిపోవడం స్వాలో చెయ్యలేని బిట్టర్ విషయంగా మారిపోయిది.....పాశ్చాత్య సైన్స్ అండ్ టెక్నాలజీలను మనం లెఫ్ట్ అండ్ రైట్ చూడకుండా, అవసరమున్నా, లేకపోయినా ఇంపోర్ట్ చేసుకొని ఫారిన్ ఎక్స్ఛేంజ్ వృథా చేసేసుకొంటున్నాం..... అందుకని ఇక్కడ గేదర్ అయిన సీనియర్ సిటిజెన్స్ అందరూ మీమీ గ్రాండ్ చిల్డ్రన్ని తెలుగు స్కూల్స్ లోనే అడ్మిట్ చేయాలని మీ సన్స్ తో ఫైట్ చెయ్యాలి.... రీసెర్చ స్కాలర్స్ అందరూ మీ థీసిస్సులలో ఇంగ్లీషు వర్డ్స్ యూజ్ చెయ్య కుండా జాగ్రత్త పడండి. మీరు పిహెచ్ డిలు సంపాదించగానే జాబ్ లు వచ్చేటట్లు స్యూరిటీ ఇవ్వాల్సిందిగా నేను స్టేట్ గవర్నమెంట్ కి అప్పీలు చేస్తాను...... నాకు ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ గారితో మరో ఫిఫ్టీన్ మినిట్స్ లో ఒక ఇంపార్టెంట్ మీటింగ్ ఉంది. టైమ్ అవుతోంది. వస్తాను మరి! ఆల్ ద బెస్ట్!”

పైవాక్యాలలో చుక్కలున్న చోటల్లా, హంసారాణి మెడలో వ్రేలాడదీసుకొన్న చలాకీ ఫోన్ మ్రోగుతోనే ఉంది. ఆవిడ ఒక పక్కకువెళ్లి, మాట్లాడి తిరిగి వస్తోనే ఉంది. సభాప్రాంగణం నిశ్శబ్దంగా ఉండిపోయింది. స్థానిక తెలుగు భాషా సంస్థ అధ్యక్షుడు, లోలోపల పళ్లు కొరుక్కొంటూ, నీరసంగా నిశ్శబ్ద కరతాళ ధ్వనులు చేశాడు. కారెక్కిన హంసారాణి దారిలో ఆగి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గారితో ఒక పదినిముషాలు మాట్లాడి మళ్ళీ కారెక్కి తుర్రుమంది. అక్కణ్ణుంచి నేరుగా ఒక ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫారం హౌస్ ఉద్యానవనంలో జరుగుతున్న దౌహిత్రుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనడానికి వెళ్లింది. స్వయం సంచారాధికారం ఉన్న హంసారాణికి ప్రాంతీయభాష సంస్థలోని అధికారిక ఉపన్యాసం ఒక వంక మాత్రమే.

3

ప్రాంతీయ భాషాసంస్థలో ఉపన్యాసానికి వచ్చిన ఓ పాత్రికేయుడు సమావేశ వివరాలు వ్రాసి యిమ్మని కోరాడు. ప్రాంతీయ భాషాసంస్థ అధ్యక్షుడు వచ్చేకోపాన్ని ఆపుకొంటూ, హంసారాణికి చెంచా అయిన ఓ ఉపన్యాసకుడికి ఆ పని అప్పగించాడు. సరస్వతి చేతనున్న భారతీయ భాషా గ్రంథంనుంచి తెలుగు పుటలు రాలిపోసాగాయి.

# ఆంజనేయం మహావీరం



కొత్త రామానందం

దుష్టానం శిక్షణర్థాయ శిష్టానాం రక్షణాయ చ
రామ కార్యార్థ సిద్దర్ద్యం జాత: శ్రీ హనుమాన్ శివః

అని 'పరాశర సంహిత' గ్రంథం చెబుతున్నది. దుష్ట శిక్షణ, శిక్ష రక్షణ చేసేందుకు పరమశివుడే రామ కార్యాన్ని సిద్ధింపజేసే సంకల్పంతో హనుమంతుడిగా అవతరించాడు. కావున హనుమ పరిపూర్ణ రుద్రావతార సంభూతుడు. ఆమంగళములను అంతం చేసి సన్మంగళములను చేకూర్చినట్టి భక్త వరుడు హనుమంతుడు. ధార్మికమైన ఏ కోరికనైనా నెరవేర్చుటకు ఆంజనేయుడు ముందుంటాడు కోరికలు తీరుస్తూ భక్తులకు మోక్షాన్ని కూడా అందించగలవాడు హనుమంతుడేనని పురాణాలు చెబుతున్నాయి. "రామ రామ సీతారామ" అని జపిస్తే చాలు అన్నీ తను చూసుకుంటాడు. మనకు కొండంత అండగా దండగా ఉంటూ అనుగ్రహిస్తూంటాడు. 'ఆంజనేయం మహావీరం బ్రహ్మ విష్ణు శివాత్మకం తరుణార్క ప్రభాశాంతం ఆంజనేయం నమామ్యహం.' అని దేవాలయ స్తంభం వద్ద నుంచి లోపలి స్వామిని కనులారా దర్శించుకుంటూ, భక్తితో ప్రదక్షిణాలు చేస్తే శీఘ్ర ఫలితాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సూర్యుడు నమస్కార ప్రియుడు, శివుడు అభిషేక ప్రియుడు అయినట్లు హనుమంతుడు ప్రదక్షిణ అంటే ఇష్టపడతాడు. ఆయన కరుణామయుడు.

బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వ మరోగతా
అజాడ్యం వాక్పటుత్వంచ హనుమత్ స్మరణాత్ భవేత్॥

ఆంజనేయ స్వామిని స్మరించడం వల్ల తెలివితేటలు అంటే వివక్షణా జ్ఞానం లభిస్తుంది. బలం, కీర్తి, దేనికైనా చలించని ధైర్యం లభిస్తుంది. భయం తొలగిపోతుంది. శారీరక, మానసిక రుగ్మతలు తొలగుతాయి. అజాడ్యం అంటే చురుకుగా పనిచేసే శక్తి. అందరిని ఆకట్టుకునేలా మాట్లాడే శక్తి లభిస్తుంది. అని ఋషి ఉవాచ. ఆర్తితో పిలిచేవారికి ఆపన్న వరదహస్తం అందించే సులభ సాధ్యుడైన దైవం ఆంజనేయ స్వామి. ఆయన స్మరణ మన సర్వపాపాలను హరించి వేస్తుంది. అట్టి రామభక్తునికి మనదేశంలో అత్యధిక దేవాలయాలు విరాజిల్లుతున్నా-



యి. హనుమంతుని చిన్న లేక పెద్ద దేవాలయం గాని, మందిరం కాని, విగ్రహం కాని లేని నగరం, గ్రామం, జానపదం గానీ లేవు. స్వామి హనుమత్ప్రభావం లేని ప్రదేశము ఈ భారతావని యందే లేదని చెప్పవచ్చును. శ్రీమద్రామాయణం మంత్ర గర్భిత కావ్యం. అందులో పరమేశ్వర చైతన్యం విష్ణు, రుద్ర, శక్తి రూపాలలో నిక్షిప్తమై ఉంది. విష్ణు తేజం శ్రీరామునిగా, శక్తి స్వరూపం సీతమ్మగా, రుద్రమూర్తి హనుమంతునిగా వ్యక్తమయ్యారు. ఈ ముగ్గురూ సమ ప్రాధాన్యం కలవారిగా రామాయణంలో మన్ననలు అందుకుంటున్నారు. హనుమంతుడు సహాయంతో త్రేతాయుగంలో రావణాదుల్ని వధించి ధర్మాన్ని రక్షించడం కోసం శ్రీరాముడు అవతరించాడు. హనుమ శ్రీరామచంద్రమూర్తికి దాసానుదాసుడు. రామాంజనేయల మైత్రి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. శ్రీరామదూత రాముడి బంటుగా తనను గుర్తించడమే ఆయనకిష్టం. ఆంజనేయుడి దాస్య భక్తికిది నిదర్శనం.

శివుని అష్టమూర్తుల్లో ఒకడైన వాయువు అంశతో, కేసరి భార్య అంజనాదేవికి రుద్రతేజంతో హనుమంతుడు జన్మించాడు. ఆయన పావన చరిత్ర పరమ పవిత్రమై, పరమ మధురమైన పరమాదర్శమై, అత్యద్భుతమై ఉన్నది. పరమ పావని జనని పుణ్యశీలియగు అంజనాదేవి కాని రుద్రవీర్య సముద్భవునిగా, వాయుపుత్రునిగా, కేసరి నందనునిగా ఆయనకు నామాంతరములు కలవు. అనగా శివ, వాయు, కేసరులు ఇతని జనకులు. ఏ నామాన్నయితే తాను నిత్యం జపిస్తుంటాడో, ఆ రామ నామానికి శాశ్వతం కల్పించడానికే శ్రీరామావతారాన్ని ముందుగా హనుమంతుని జన్మకు వైశాఖ బహుళ దశమినాడు అంకురారోహణ చేశాడు పరమశివుడు. తన అంశను తీసుకుపోయి అంజనాదేవి గర్భాన చేర్చమని వాయుదేవుణ్ణి నియోగించారు. అందుకే వాయు పుత్రుడు, పవన సుతుడు, మారుతి అనే వివిధ నామాలతో ప్రస్తుతి పొందుతున్నాడు హనుమంతుడు. ఈయన చిరంజీవి. హిమాలయాలలో నేటికీ రామ నామం స్మరణ చేసుకుంటూ ఉంటాడని పురాణాలు చెబుతున్నాయి.

శైశవంలోనే ఉదయభానుణ్ణి ఎర్రని పండుగా భ్రమించి మింగేందుకు ప్రయత్నించాడు. ఆ సమయం రాహు గ్రహణ కాలం. శరవేగంతో ఆకాశమార్గాన ఎగిరి వస్తున్న బాలుడిని చూసి భయపడి రాహువు ఇంద్రునితో విన్నవించుకున్నాడు. ఇంద్రుని వజ్ర ఘాతానికి మూర్ఛిల్లాడు మారుతి. బాలుని హనుమల (చెక్కిళ్ళు)పై కొట్టడం వల్ల మూర్ఛిల్లి పర్వత శిఖరం పై పడిపోయాడు. మూర్ఛపోయిన మారుతిని ఎత్తుకెళ్ళి ఒక కొండ గుహలో ఉంచుతాడు. అప్పుడు బ్రహ్మతో కలిసి వచ్చిన సకల దేవతలు మారుతిని తెప్పరిల్ల జేసి,అనేక వరాలు ప్రసాదించారు. ముక్కోటి దేవతలందరూ తమ తమ సంబంధమైన అస్త్ర, శస్త్ర, మంత్ర తంత్రాలేవీ ఆంజనేయునిపై పనిచేయవని వరం ఇస్తారు. బ్రహ్మదేవుడు చిరంజీవిగా ఆశీర్వదిస్తారు. ఇదే కాక హనుమ పేరుతో హనుమద్వ్రతం లోకంలో ప్రసిద్ధికెక్కుతుందని, ఈ వ్రతాన్ని ఎవరు చేస్తారో వారికి సకల కార్యాలు నెరవేర్చాలని హనుమను ఆదేశిస్తారు.

బ్రహ్మ ఉపదేశం మేరకు సూర్యదేవుని వద్ద విద్యాభ్యాసానికి వెడతాడు. ఉదయాద్రిపై ఒక పాదం, అస్తాద్రిపై మరొక పాదం ఉంచి సూర్యరథ గమనానికి అనుగుణంగా సంచరిస్తూ సూర్యుని వద్ద సకల శాస్త్ర వాఙ్మయాన్ని అభ్యసించాడని పురాణాలు చెబుతాయి. అందుకే ఆయనను నవ వ్యాకరణ పండితుడు అని పిలుస్తారు. హనుమ సూర్యునికి ప్రత్యక్ష శిష్యుడు. శిష్యుడుగానే కాకుండా సూర్యుని అల్లునిగా కూడా హనుమ కొన్ని పురాణాలలో కనిపిస్తాడు. సూర్యుడు వర్చస్సు సువర్చల కన్యగా మారిందని తన కుమార్తె అయిన సువర్చలను హనుమంతునికి ఇచ్చి సూర్యుడు వివాహం చేశాడని కొందరంటా-

రు. ఇప్పటికీ కొన్ని దేవాలయాల్లో సువర్చలా హనుమంతులకు కళ్యాణం జరుపుతుంటారు. విద్యాభ్యాస అనంతరం సూర్యునితో గురుదక్షిణగా ఏం సమర్పించాలో తెలియజేసి నన్ను కృతజ్ఞుణ్ణి చేయండి అని ప్రార్థించాడు. అందుకు సూర్యుడు హనుమా! నా అంశతో జన్మించిన సుగ్రీవుని నువ్వు సేవించు` అదే నాకు గురుదక్షిణ అని ఆదేశించాడు. సుగ్రీవుడు తన సోదరుడైన వాలి వల్ల ఇక్కట్లు పాలయ్యాడు. ఈ సంక్లిష్ట సమయంలో మీ చేయూత అతడికి అవసరం అన్నాడు. వాలి తరిమికొట్టినందువల్ల ఋశ్యముఖ పర్వతంపై తలదాచుకున్న సుగ్రీవుని హనుమంతుడు కలుసుకున్నాడు. ఆయన మంత్రిగా గాక అత్యంత ప్రియ స్నేహితుడు కూడా. రామునితో స్నేహం చేయించి వానర రాజ్యానికి అధిపతిని చేసి తన పత్ని కూడా లభించేలా చేశాడు. గురు పుత్రుడైన సుగ్రీవునికి ఈ విధంగా మేలు చేసి గురు రుణం తీర్చుకున్నాడు. అంతేకాదు సూర్యుని వంశంలో జన్మించిన రామచంద్రునికి సేవలు చేసిన ఘనత కూడా మారుతికి దక్కుతుంది. మొత్తం మీద సూర్యునితో సూర్యవంశంతో ఉత్తమ మైత్రి కలిగిన హనుమను సూర్యాంజనేయులుగా భక్తులు కొలుచుకుంటారు.

హనుమంతుడు బాల్యంలో చాలా అల్లరి చేసేవాడు. అంజనాద్రిపై ఆంజనేయుడు అల్లరిగా తిరుగుతుంటే అంజనాదేవి పిల్లవాని కాళ్లకు, చేతులకు బేడీలు తగిలించి ఎక్కడికి కదలకుండా శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ఎదురుగా నిలబెట్టినట్లు స్థల పురాణం చెబుతుంది. స్వామి కాళ్లకు, చేతులకు బేడీలు తగిలించి ఉండడం వల్ల శ్రీ బేడి ఆంజనేయ స్వామి అనే పేరు వచ్చిందంటారు. ఈ ఆలయాన్ని తిరుమలలో వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఎదురుగా పశ్చిమాభిముఖంగా ఈ ఆలయం ఉంది. ఇచ్చట హనుమంతుని దర్శించుకుంటే భక్తుల సమస్యలు తొలగిపోతాయి అంటారు. హనుమంతుడు బాల్యంలో ఆ ప్రాంతంలోని ఋషుల ఆశ్రమాలు దర్శించి అచ్చటి యాగ సామానులను అస్తవ్యస్తం చేస్తూ వారికి కష్టం కలిగించే వాడు. ఇతని చేష్టలను భరింపలేక అవసరమైన వేళ వరకు నీ బలం గుర్తుకు రాకుండా ఉండుగాక అని ఆ ఋషులు శాసించారు. ఆయన సముద్ర లంఘనం వరకు తన విజృంభణ ఎన్నడూ ప్రదర్శించలేదు. జాంబవంతుని ప్రేరణతో సీత అన్వేషణకు పూనుకున్న హనుమంతుడు లంకాపురం చేరేందుకు చేసిన అతి కష్టతరమైన నాలుగు పనులు నిర్వహించాడు. అవి సముద్రలంఘనం, మైనాకుని ఆదిత్యాన్ని తిరస్కరించడం, సురసను జయించడం. సింహిక దమనం. ఈ కష్టతరమైన పనులు నాలుగింటిని హనుమంతుడు దృష్టి, ధృతి, మతి, దాక్ష్యం అను నాలుగు లక్షణాలతో సాధించాడు.

రామాయణంలో సుందరకాండను ఈ సందర్భంగా ప్రస్తావించుకోవలసి ఉంది. రామాయణ పారాయణం సుందరకాండతోనే ప్రారంభమైందని పెద్దలు చెబుతారు. ఏమిటి సుందరకాండ ప్రత్యేకత? అందులోని ప్రధాన అంశాలు ఏమిటి అని మనం పరిశీలిస్తే ప్రధానంగా ఆంజనేయస్వామి శక్తి యుక్తులు వివరణగా మనకు కనిపిస్తుంది. కామరూపుడైన ఆంజనేయులు అశోక వనంలో శోక తప్త సీతమ్మవారిని చూస్తాడు. అక్కడ నుంచి కథ రసవత్తరంగా సాగుతుంది. ఆమెకి విశ్వరూపం చూపడం ఎందరెందరో రాక్షస యోదుల్ని, రావణుని ప్రియ పుత్రుడు అక్షయకుమారుడిని సంహరించాడు. చివరికి విధాత మీద గౌరవంతో బ్రహ్మాస్త్రానికి అంజలి ఘటించి లొంగిపోవడం, రావణునికి హిత వచనాలు చెప్పడం కొసమెరుపుగా లంకా దహనం చేయడం, ఈ సంఘటనలకు సమానమైన అద్భుతాలు ప్రపంచంలోని మరి ఏ సాహిత్యంలోనూ కనిపించవు.

హనుమంతుడు లంకలో సీతాదేవి కానరాక నిరాశకు గురై రిక్త హస్తాలతో వెనుదిరిగితే శ్రీరాముడితో సహా అంతా హతాసులవుతారని చింతించుచూ ప్రాణ త్యాగం చేసుకోకుండా మానుకున్నాడు. ఆశావాదిగా వ్యవహరించి

సీత అన్వేషణలో తుదకు సఫలీకృతుడయ్యాడు. రావణాసురుడు తనకళ్ళేదుటే సీతను బెదిరించి వెళ్ళిపోతే ఆమె (సీత) విరక్తితో ఆత్మహత్యకు ఉద్యుక్తురాలైనప్పుడు మారుతి తన రామ కథా గానంతో సీతాదేవిని ఊరడిరచి రామ సందేహాన్ని వినిపించాడు. ఆమె చూడామణి ఆభరణాన్ని భక్తితో తీసుకున్నాడు. పిమ్మట రావణున్ని కలిశాడు. హితవు చెప్పినాడు. ఇచ్చిన మారుతి తోకకు నిప్పంటించగా విశ్వ విజేతలైన రాక్షస వీరులను దోమలలాగా నలిపి వేయటమే కాక యావత్తు లంకా నగరాన్ని భస్మీపటలం చేసి హనుమ తన వీరత్వాన్ని లోకానికి తెలియజేశాడు. హనుమంతుని ధైర్య పరాక్రమాలు, శక్తిసామర్థ్యాలు ఎంతటి సమ్మున్నతమైనవో అనేక సంఘటనలలో తెలియజేస్తాయి.

సీతనిచ్చేయాలని ఒకదౌత్యవేత్తగా రావణునికి హితవు చెప్పాడు. రావణుడు సభలో ఇంద్రజిత్తు ఆంజనేయుని తన బ్రహ్మాస్త్రంతో బంధించి తీసుకు వెళతాడు. రావణుడు సింహాసనం పైన కూర్చుని హనుమంతుని అవమానిస్తాడు. దాంతో తన తోక తోనే సభా మధ్యంలో కూర్చుని తన ధైర్య పరాక్రమాన్ని ప్రదర్శిస్తాడు. ఇది కాక తన తోకకు అంటించిన నిప్పుతోనే హనుమ లంకను కాల్చి వేస్తాడు. ఈ సీతాన్వేషణ సమయంలో రావణ కుమారుడయిన అక్షయ కుమారుడు హతమయ్యాడు. లంకాదేశ కాపరి సింహిక కూడా హనుమ ముష్టి ఘాతానికి చనిపోయింది. మహాధీశాలిగా రాముని ద్వారా అభినందనలు పొందటమే కాక హనుమను రాముడు తన అక్కున చేర్చుకొని గాఢంగా కౌగిలించుకున్నాడు. అంతటి అదృష్టం మరి ఎవరికి కలుగుతుంది.

రామ రావణ యుద్ధంలో ప్రళయ కాలరుద్రునివలె వ్యవహరించి రామకార్యాన్ని తన భుజ స్కందాలపై వేసుకుంటాడు. ఇంద్రజిత్తు చేసిన నాగాస్త్ర ప్రయోగానికి నిశ్చేష్ఠులై పడిపోయిన వానరులందరినీ మూర్ఛపోయినా లక్ష్మణుని రక్షించుటకు కావలసిన ఔషధాల కోసం సంజీవిని పర్వతాన్ని తెచ్చి తమ్ముని ప్రాణప్రదాతగా నిలిచాడు. రాముడు హనుమంతుని అనురాగంతో సజల నయనాలతో ఆలింగనం చేసుకున్నాడు. యుద్ధ సమయంలో పంచముఖ ఆంజనేయ స్వరూపిగా వ్యవహరించి రావణ సంహారంలో తన పాత్రను సమయస్ఫూర్తితో వ్యవహరించిన అమిత బలవంతుడు, రాక్షసులను అణిచివేశాడు. హనుమ స్మరిస్తే, దర్శిస్తే చనిపోదామనుకున్నా వారి ప్రాణాలు సైతం నిలబడతాయి. దీనికి నిదర్శనం భరతునికి శ్రీరామ ఆగమన వార్త అత్యంత వేగంగా శృంగభేరిపురం వెళ్లి అందజేశాడు. భరతుడు సరయూనది ప్రవేశం చేయకుండా ఆపి అతని ప్రాణాలు నిలబెట్టాడు.

రామ పట్టాభిషేక సమయంలో సీతాదేవి హనుమంతునికి ఒక ముత్యాల హారాన్ని బహుకరించింది. దశ గుణాలనే మణులతో రామానుగ్రహ వీక్షణం అనే సూత్రంలో బంధించిన అపూర్వ హారం ఇది. సీతా! నీకు ఎవరి విషయంలో సంతోషం ఉందో తేజస్సు, ధైర్యం యశస్సు, నేర్పు, సామర్థ్యం, వినయం, నీతి, పౌరుషం, పరాక్రమం, బుద్ధి అనే గుణాలు ఎవనిలో ఎక్కువగా ఉన్నాయో అతనికి ఈ హారానివ్వు అని శ్రీరాముడు పలికిన వెంటనే ఆహారాన్ని హనుమంతునికి బహుకరించింది. రామాయణంలోని రాముడు చేసిన పనులకు చెప్పిన మాటలను విశ్లేషిస్తే లభించే సుగుణాలహారమే ఈ ముత్యాలహారం. దశమినాడు జన్మించిన హనుమంతుడికి దశ గుణమణి హారమే సముచిత బహుమానం.

హనుమ ఎల్లవేళలా రాముని బంటుగా తనను గుర్తించడమే ఆయనకిష్టం. ఆంజనేయుని దాస్య భక్తికి నిదర్శనం. సీతమ్మ ప్రేమించినట్టే శ్రీరాముడు తనను కూడా అధికంగా ప్రేమిస్తాడని కోరికతో శరీరం అంతా సింధూరం పులుముకుంటాడు. ఆ స్వామి ఆరోగ్యంగా ఉండాలని వంటి నిండా తమలపాకులు నిత్యం ఆభరణాలుగా ధరిస్తాడు. హనుమంతుడు అంటే భక్తికి మారు రూపం భక్తి అనే మాట విస్మృతి

పొందితే ధర్మం అవుతుంది. ధర్మంపై అనురక్తి ఉన్నచోట హనుమకరణ తప్పక ఉంటుంది. రామాయణ గ్రంథంలోని సుందరకాండను భక్తులు నిత్యం పారాయణం చేస్తే కష్టాలు తీరుతాయని, తలపెట్టిన కార్యం ఫలప్రదం అవుతుందని విశ్వాసం. ఆంజనేయుని భక్తితో పూజించినచో భూత, పేత్ర, డాకినీ, శాకిని వంటి పిశాచాలు దరికి రావు. పరమ వైష్ణవ భక్త శికామణి ఆంజనేయుడు కోరిన వారికి కోరిన రూపాన దర్శనం ఇస్తాడు తలచిన వారికి తలపులలోని అభీష్టాలను సిద్ధింప చేస్తాడు. ఓ స్వామి ఆంజనేయా! నీలోని కార్యసాధక శక్తిని నాకు ప్రసాదించు అంటూ ఎక్కడైనా మొదలుపెట్టేముందు ప్రార్థిస్తే ఆ పని సులువుగా పూర్తి అవుతుంది. ధార్మికమైన ఏ కోరికనయినా నెరవేర్చడానికి హనుమంతుడు ఎల్లవేళలా ముందుంటాడు. ఆయన జీవితమంతా పరోపకారమే ఆయన తన కోసం అంటూ తాను చేసుకున్నది ఏదీ లేదు. శ్రీరామచంద్రుడు తన అవతార సమాప్తి సమయంలో శ్రీరామునితో పాటు వారి కుటుంబ సభ్యులు ఇతర పరివారం అంతా వైకుంఠానికి తరలిపోతున్న తరుణాన హనుమను శ్రీరాముడు తనతో తీసుకువెళ్లదలచి వైకుంఠానికి రమ్మనమన్నాడు. అందుకు హనుమ వినమ్రతతో రామనామం సదా స్మరించుకుంటూ ఇక్కడనే ఉండిపోదలచినట్లు చెప్పి ఆయన దీవెనలు పొందాడు. ఆయన దీవెన అనుసరించి ఎక్కడ రామ కథా గానం సాగితే అక్కడ హనుమ వచ్చి తనివి తీరా విని సంతోషభరితుడవుతాడని దీవించాడు.రామభక్తహనుమాన్ నేటికీ గంధమాదన పర్వతంపై తపోనిష్టుడై భక్తులను అనుగ్రహిస్తున్నాడు. హనుమంతున్ని ఆరాధిస్తే శనిదేవత వేధించడని భక్తులు విశ్వసిస్తారు. మనదేశంలోని ఉత్తరాదివారు ఆంజనేయుని బజరంగబలిగా వ్యవహరిస్తారు. దక్షిణాదివారు ప్రతి మంగళ, శనివారాలలో పూజలు చేస్తారు. స్వామివారు ద్వాపర యుగంలో మహాభారత యుద్ధ సమయాన పాండవ మధ్యముడైన అర్జునుని రథానికి కట్టిన జెండాపై ఉండి మనోబలాన్ని విజయాన్ని అందించాడని ఐతిహ్యం. కాశీ క్షేత్ర నివాసి తులసీదాసు రామ అనుగ్రహాన్ని మారుతి అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందిన మహా భక్తుడు. ఆయన వద్ద ఉన్న ఎన్నో మహిమలు ప్రజలు చెప్పుకునే వారు. ఈ విషయం ఆనాటి పాలకుడై అక్బర్‌కు తెలిసి తులసీదాసుని పిలిపించి మహిమలు చూపించమన్నాడు. విలువైన కానుకలు ఇస్తానన్నారు. అయితే ఆ లీలలన్నీ తన ప్రభువు రామచంద్రునివే అని సవినయంగా పలికాడు. అందుకు అక్బర్ ఆగ్రహించి తులసీదాసుని కొరడాలతో కొట్టమన్నాడు. తులసీదాసు రామనామ స్మరణ చేయగా భటులు కొరడాలు లేచినట్టు లేచి అలానే ఉండిపోయాయి. అసంఖ్యాకమైన కోతులు దర్బార్‌లోకి వచ్చి వేధించసాగాయి. అక్బర్ తన తప్పిదాన్ని మన్నించమని వేడుకోగా కోతులు అంతర్ధానమైనాయి. ఈ సంఘటనను చూచిన తులసీదాసు భక్తి ప్రపత్తులతో ఆంజనేయస్వామిని ప్రార్థించాడు. అదే హనుమాన్ చాలీసా ఈ కలియుగంలో రామదాస్ ఉదయించాడు. అతడు శ్రీరాముని కోసం కఠోర తపస్సు చేశాడు. బదరీ క్షేత్రంలో రామదాసుకు ఆంజనేయుడు ప్రత్యక్షమై సన్యాస దీక్ష అనుగ్రహించాడు. సమర్థ రామదాసుగా పేరు మార్చాడు. ఈ మధ్యకాలంలో 41 రోజులు (మండలం) హనుమాన్ దీక్షను భక్తి ప్రపత్తులతో ఆచరిస్తున్నారు. ఏక బిగువుగా 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసి స్వామి కృపకు పాత్రులవుతున్నారు. హనుమాన్ జయంతి వైశాఖ బహుళ దశమి నాడు సుందరాకాండ పారాయణం చేసి తమలపాకులతో పూజ నిర్వహించి గారెల దండ స్వామివారి తోకకు వేసి నారికేళం, పళ్ళు నివేదన చేస్తే సకల శుభాలు కలుగుతాయి. ఆయనను భక్తితో సేవించిన వారికి భోగం, మోక్షం రెండు లభిస్తాయి.

**వీరభక్త హనుమాన్ కి జై**

# హితోక్తులు

దానము చేయనేరని ఆ ధార్మికు సంపద ఉండియుండియున్
తానే ఫలాయనంబగుట తద్యము బూరుగు వ్రానుకాచినన్
దాని ఫలంబు లూరక వృధాపడిపోవలె ఎండి రాలిచే
కొనల లోన ఏమిటికో గాక అబోజ్యము లేత భాస్కరా!

భాస్కరా! బూరుగు చెట్టు పండ్లు తినడానికి పనికిరావు అందువల్ల అవి ఎండి గాలికి రాలి అడవులలో పడి ఎవరికి ఉపయోగపడక నాశనమై పోతాయి. అలాగే దానం చేయని వాని సంపదలున్నా నిష్ప్రయోజనమై ఎవరికి ఉపయోగపడక నశించిపోతాయి


అప్పు లేనివాడే అధిక సంపన్నుడు తప్పు లేని వాడు ధరణి లేరు !
గొప్ప లేని బుద్ధి కొంచమైపోవురా విశ్వదాభిరామ వినురవేమ !!

అప్పులు చేయనివాడు అధిక సంపద కలిగిన వాడితో సమానం. తప్పు చేయని-వాడు ఈ భూమిపై లేరు కానీ అప్పులు చేయుట అలవాటైతే ఎంత గొప్పవారైనా బుద్ధిహీనులవుతారు.

తల్లి, తండ్రి మీద దయలేని పుత్రుడు పుట్టలేని వాడు గిట్టనేమి !
పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా విశ్వదాభిరామ వినురవేమ !!

తల్లిదండ్రులపై ప్రేమ లేని కుమారుడు పుట్టినా చనిపోయిన ఒకటే. పుట్టలో పుట్టి ఎవరికీ లాభం లేక ఆ పుట్టలోనే చనిపోయే చెదపురుగుల వలె తల్లిదండ్రులపై ప్రేమ లేని కుమారుని పుట్టుక వ్యర్థమని అర్థం.

# సహస్రచంద్రదర్శన సాహిత్యతపస్వి ఆచార్య ఎస్వీ రామారావు



తుమ్మూరి రాంమోహనరావు


" పుస్తక పఠనం మనిషికి లభించే గొప్పవరం.పుస్తకాన్ని మించిన ఆప్తమిత్రుడు లేడు. మనిషి కష్ట సుఖాల్లో, జీవితంలోకి ఒడిదుడుకుల్లో తోడుగా నిలిచి ఊరట కలిగించే దివ్యౌషధం సాహిత్యం. నాకు అక్షర జ్ఞానం కలిగిన బాల్యం నుండి నేటి వరకూ జీవితమంతా పుస్తక ప్రపంచంలోనే గడపటం నా భాగ్య విశేషం" అంటారు ఆచార్య ఎస్వీ రామారావు గారు.

సహస్ర చంద్రదర్శనానికి అతి సమీపంలో ఉన్న ఆచార్య సూగూరు వెంకట రామారావు గారు పాలమూరు పసిడి బిడ్డ. సురవరం ప్రతాపరెడ్డి పుట్టిన నేలమీద పుట్టిన పుణ్యాన ఆయన స్ఫూర్తితో తెలుగు సాహితీ జలనిధులను ఆపోశనం పట్టిన అపరాగస్త్య మహర్షి ఆచార్య ఎస్వీ రామారావు గారు.

సాహిత్యంలో అతి క్లిష్టమైన విమర్శను ఇష్టమైన ప్రక్రియగా ఎంచుకుని ప్రప్రథమంగా 'తెలుగులో సాహిత్య విమర్శ' అన్న అంశంతో ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి డా.సి. నారాయణ రెడ్డి గారి నేతృత్వంలో పిహెచ్.డి పట్టా పొందిన విమర్శకాగ్రేసరులు రామారావు గారు. దశాబ్దాలుగా సాహిత్య సేవలో నిమగ్నమైమన వీరు పలు విమర్శాగ్రంథాలను, సాహిత్య చరిత్రలను వెలయించిన విజ్ఞాన ఖని. అన్వీక్షణం ,సమవీక్షణం, అభివీక్షణం, మనోవీక్షణం వంటి



సాహిత విమర్శ కు సంబంధించిన వ్యాస సంపుటులను వెలువరించి తెలుగుసాహిత్య విమర్శా రంగానికి మార్గదర్శకులైనారు.
సాహిత్య చరిత్రల విషయంలో కూడా వీరి కృషి గణనీయమైనది.ముందు తాను పుట్టిన జిల్లా పాలమూరు ప్రాచీన కవుల చరిత్రను పలు గ్రంథాలనుండి సేకరించి
' పాలమూరు సాహితీ వైభవం' అనే పేరుతో ప్రచురించారు. ఆ తరువాత పాలమూరు ఆధునికయుగ కవుల చరిత్ర ను వెలువరించారు. అలా తాము పుట్టిన గడ్డ ఋణం తీర్చుకుని కృతకృత్యులయ్యా రు.అదే వరుసలో తెలుగు సాహిత్య చరిత్ర, తెలంగాణ సాహిత్య చరిత్ర, తెలంగాణ ప్రాచీన సాహిత్య కరదీపిక,తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం, సమగ్ర తెలుగు సాహిత్య చరిత్రలతో పాటు తమ ఊరి కవుల గురించి మా ఉరి కవులు ,ఇటీవ ల జిల్లా గా ఏర్పడిన వనపర్తి జిల్లా సాహిత్య చరిత్రలను రాయటం చూస్తే వీరి నిరంతర పరిశోధనా పటిమ ఎంతటిదో అర్థమౌతుంది.
విమర్శ రంగానికి చెందిన పలువురు తెలుగు విమర్శకుల పరిచయాలతో విమర్శకవతంసులు అనే వీరు రాసిన గ్రంథాన్ని ఆంధ్ర సారస్వత పరిషత్తు ముద్రించింది.
ఇన్ని రాసినా తృప్తి కలుగక ఇటీవల ఇరవయ్యవ శతాబ్ది



తెలుగు సాహిత్య చరిత్రను వెలువరించారు. అలాగే ఆధునిక కవుల సంక్షిప్త పరిచయాలతో ఆధునిక తెలుగు కోశం పలువురు సాహితీ సేవానురక్తుల సహకారంతో వెలువరించా రు.
ఇవే కాక వీరు రాసిన కథలు, కవితలను సాహితీ కదంబంగా వెలువరించడం జరిగింది.సత్యసాయి పై గల అచంచల విశ్వాసంతో శ్రీసత్యసాయి అవతారం దశావతార గాథలు అనే పుస్తకాన్ని,బూర్గుల రామకృష్ణారావు జీవిత చరిత్ర , నూటపది వసంతాల శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం , తెలుగు భాష ప్రాచీనత వైశిష్ట్యం, పరిశోధనోత్సవం వంటి ఇతర రచనలు వెలువరించారు. ఇంత సాహిత్య సమాకలన వ్యగ్రతలో కూడా వీరికి అభిమాన రంగమైన సినిమారంగాన్ని వదిలి పెట్టలేదీయన. ఎన్నో ఏళ్లుగా తాను చూసిన సినిమా సమీక్షలను పలు పత్రికల ద్వారా ప్రకటించారు. అంతే కాకుండా తెలంగాణ సినిమా బంగారు కాంతులు అనే పుస్తకం ఇటీవల ప్రచురించారు ఆచార్య ఎస్వీరామారావు గారు.


సాహిత్యమే లోకమైన వీరు నన్నయ దర్శనం (ఆదిపర్వం అవతారిక) ,కర్ణ పర్వం ( ద్వితీయాశ్వాసం) , భీమేశ్వర శతకం పేర్లతో వ్యాఖ్యాన గ్రంథాలు, కృత్యాలోకనం పేరుతో తాము పలు గ్రంథాలకు రాసిన పీఠికలను వెలువరించారు.

ఇక వీరి వ్యక్తిగత విషయాలకు వస్తే వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపురంలోతేది 5 జూన్ 1941 , విషు నామ సంవత్సర చైత్ర శుద్ధ దశమి రోజున శ్రీమతి సూగూరు రామచూడమ్మ, సూగూరు వాసుదేవరావు దంపతుల శుక్తిముక్తాఫలంగా జన్మించారు. తెలుగులో ఎం.ఏ.పిహెచ్డీ నే గాక డిప్లమా ఇన్ జర్నలిజం, హిందీ భూషణ్ మొదలైన విద్యార్హతలను పొందిన నిత్య విద్యార్థి ఆచార్య ఎస్వీఆర్.

డీన్ , ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ గా పదవీ విరమణ గావించిన రామారావుగారు మూడున్నర దశాబ్దాలు వివిధ హోదాలలో వృత్తిపరమైన సేవలందించారు.

ఇంతటి ప్రతిభామూర్తిని పలు పురస్కా రాలు వరించడంలో ఆశ్చర్యమేమున్నది?

పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుండి ఉత్తమ విమర్శకునిగా పురస్కారం, సహృదయ ( వరంగల్లు) సాహితీ పురస్కారం, విశ్వసాహితీ పురస్కారం, దాశరథి పురస్కారం, ఉమ్మెత్తల పుర స్కారం,జీవిఎస్ సాహితీ పురస్కారం-,ఇరివెంటి పురస్కారం, బూర్గుల




పురస్కారం,దివాకర్ల పురస్కారం,వానమామలై, కొండేపూడి, గురజాడ అప్పారావు , సనాతన ధర్మ ట్రస్టు, సురవరంప్రతాపరెడ్డి పురస్కారాలవంటివెన్నో స్వీకరించిన ప్రజ్ఞాశాలి.

ఎంత చెప్పినా తక్కువే అనిపించే ఇలాంటి సాహితీ మూర్తి అనేక ఆకాశవాణి ప్రసంగాలు చేసారు. పలు గ్రంథాలకు సంపాదకులుగా ఉన్నారు. పలు విశ్వవిద్యాలయ సాహిత్య సమావేశాలలో పాల్గొన్నారు. దేశ విదేశాలలో సాహిత్య ప్రసంగాలు చేసారు. ఎన్నని వివరించను, ఎంతని రాయను.

ఇంతటి విద్వన్మణియైనా కించిత్తు గర్వం లేక పోవడం విద్యా దదాతి వినయం అన్న మాటకు అక్షర సాక్ష్యం.

మా కాగజ్ నగర్ లో ఒక మిత్రుని పుస్తకావిష్కరణ సందర్భంగా ఒక రోజు మాకు ఆతిథేయ భాగ్యాన్ని కలిగించి నందుకు వారికి కృతజ్ఞతా బద్ధుడను. రెండు దశాబ్దాలకు పైగా వారి వాత్సల్య

మాధుర్యాన్ని పొందుతున్న భాగ్యశాలిని.

ఇంతటి సాహితీ సంపన్నుని సహస్ర చంద్ర దర్శన సందర్భంగా కొండ అద్దమందు లాగా నాలుగు మాటలు రాసే అవకాశం కలిగినందుకు సంతోషిస్తూ వారికి హృదయపూర్వక అభినందనలు అంద జేస్తున్నాను.

# ఉసురు తీస్తున్న "ముసురు"



గుండాల మహాలక్ష్మి

సకాలంలో చేతికి అంది వస్తున్న పంటని
అకాల మృత్యువు దాడి చేసినట్లుగా
కోడిపిల్లను గ్రద్ద తన్నుకు పోయినంత సునాయా-
సంగా
అనుకోని విపత్తుతో కనుల ముందే ఆరుగాలం
కష్టించిన పంట నాశమవుతుంటే
ఏమి చేయలేని నిస్సహాయస్థితిలో కృషివలుడు
కృంగిపోతున్నాడు
సంసార సాగరంలో అంతుపట్టని సుడిగుండాలు
ఎన్నున్నా
నయాన్నో భయాన్నో ప్రాణభీతికై ఎదురీదడం
తప్పడంలేదు
నాలుగు గింజల అత్యాశతో కొత్త అప్పుచేసి మరీ
పెట్టిబడులు పెట్టాడు
అసలే కూతురి పెళ్ళి అప్పులు తీరనేలేదు కుదువ
పెట్టిన పెళ్ళాం పుస్తులు ఈసారైనా తన మెడలో
చేరుతాయని తన ఇల్లాలి గంపెడాశ చిన్నబో-
యింది
అకాల వర్షాలతో అతలాకుతలం అవుతున్న
రైతన్న జీవనం మరీ దుర్భరంగా మారింది
వెన్ను విరిగిన వరి కంకెలా
మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు
పంట నష్టాలతో విలయతాండవం చేస్తూ ఈ
ముసురు రైతుల పాలిట శాపమయింది
కష్టజీవుల ఉసురు పోసుకుని ఆ పేదోడి నడ్డి
విరుస్తుంది
ప్రకృతి ప్రకోపానికి మొదటిగా బలయిపోయేది
అన్నం పెట్టే అన్నదాతేగా....

....... 0 ........

# సువర్ణయోగం



వేమూరి వేంకటేశ్వరరావు

చరిత్రలో, చాల కాలం పాటు, సత్యాన్వేషణ, భగవదాన్వేషణ అన్నవి పర్యాయ పదాలుగా వాడడం జరిగింది. భగవంతుని ప్రస్తావన తీసుకుని రాకుండా కేవలం ప్రకృతి సత్యాలని గురించి తెలుసుకోవాలనే కుతూహలం పుట్టేసరికి కొంతకాలం పట్టింది.

అది గౌతమ బుద్ధిని కాలం. క్రీస్తు శకారంభానికి 500-600 ఏళ్ల ముందు కాలం. ఎందువల్లనో ప్రపంచంలో, పలు చోట్ల, తార్కికమైన చింత బాగా పెరిగింది. దేవుడనే భావం మీద ఆధారపడకుండా, కంటికి ఎదురుగా ఉన్న సృష్టి విచిత్రాన్ని అవగాహన చేసుకుందుకి మానవుడు ప్రయత్నించేడు. భారత దేశంలో గౌతమ బుద్ధుడు, చైనాలో కన్‌ఫ్యూషియస్, గ్రీసు దేశంలో థేల్స్, అనాక్సిమేండర్, మొదలైన వారు సమకాలీకులవడం గమనార్హం!

ఆధునిక వైజ్ఞానిక దృక్పథానికి ఆద్యుడనదగ్గ గ్రీకు తత్త్వవేత్త థేల్స్ (Thales, సుమారు క్రీ. పూ. 624 -546), “ఈ ప్రపంచం దేనితో తయారయింది?” అని ఒక సారి ప్రశ్నించేరు. మేఘాలు, మృగాలు, వృక్షాలు, ఇలా వివిధ రూపాలలో కనిపిస్తూన్న ఈ స్థూల ప్రపంచం అంతా సూక్ష్మ రూపంలో ఒక్కటేనా? మనకి దృగ్గోచరమయే బహుళత్వంలో ఏకత్వం ఉందా? సృష్టి అంతా మన మేధకి అందనంత క్లిష్టమైనదా లేక విశ్లేషించి అధ్యయనం చేస్తే అర్థం అవుతుందా? ఇటువంటి ప్రశ్నలతో ఆయన చాల కాలం కుస్తీ పట్టేరు. బంకమట్టితో ఇటికలు చేసి, ఆ ఇటికలని మూల పదార్థంగా వాడి రకరకాల ఆకారాలలో గోడలు, ఇళ్లు, గుడులు, గోపురాలు, గోరీలు కట్టినట్లే సృష్టిలో మనకి కనిపించేవన్నీ – అంటే, మేఘాలు, మృగాలు, వృక్షాలు, వగైరాలు – ఒక మూల పదార్థంతో తయారయి ఉండాలని ఆయన వాదించేవారు. ఆ మూల పదార్థం ఏదయి ఉంటుంది? ఆయన సముద్రపు ఒడ్డున నివసించేవారు. రోజూ ఎదురుగా ఉన్న మహాసాగరాన్ని చూసి, చూసి సృష్టికి మూలం నీరు అన్నారు. అంటే, ప్రపంచంలోని పదార్థాలన్నీ నీటితో తయారు చెయ్యబడ్డాయని ఆయన ఆలోచన. సృష్టికి మూలం జలం. సర్వవ్యాప్తమయిన జలం నుండే సృష్టి మొదలయి ఉండాలి. ఇదీ ఆయన ప్రవచనం.

థేల్స్ ప్రవచనం (statement) అందరికీ ఆమోదయోగ్య కాలేదు. అందరి వరకు ఎందుకు? ఆయన దగ్గర శిష్యరికం చేస్తూన్న అనాక్సిమేండర్ (Anaximander, సుమారు, క్రీ. పూ. 610-546) గురువుగారితో ఏకీభవించలేదు. ఇసకలో నీళ్లు లేవు. నీటి కంటె సర్వవ్యాప్తమైనది భూమి. కనుక సృష్టికి మూలం భూమి అన్నారు అనాక్సిమేండర్. నీటి కంటె, భూమి కంటె సర్వవ్యాప్తమైనది గాలి కనుక, సృష్టికి మూలం గాలి అవాలి అని కొందరు వాదించేరు. సర్వవ్యాప్తం అయినంత మాత్రాన సరిపోదు, శక్తిమంతమై ఉండాలి కనుక సృష్టికి మూలం అగ్ని అయితే బాగుంటుందని మరొకరు ముచ్చట పడ్డారు. ఇంతకీ ఈ నాలుగింటిలో దేనికి అగ్రస్థానం ఇవ్వాలి? ఈ తగువు తీర్చడానికి ఎంపిడోక్లీస్ (Empedocles, సుమారు క్రీ. పూ. 490-430) అనే తత్త్వజ్ఞుడు మధ్యవర్తిత్వం వహించేడు. అన్ని పక్షాల వారి వాదనలని పూర్వపక్షం చేస్తూ, “సృష్టికి మూలం నీరు, నిప్పు, గాలి, మట్టి” అంటూ తుని తగవులా తీర్పు చెప్పేడీయన.

ఈ నాలుగింటికీ ఆకాశం చేర్చి

మనవాళ్లు సృష్టికి మూలం పంచభూతాలు అన్నారు. యవన, రోమక తత్త్వాలకీ, మన వేదాంత తత్త్వానికి ఇక్కడ చెప్పుకోదగ్గ తేడా కనిపిస్తుంది. ఉదాహరణకి అంకెలని లెక్కపెట్టడమే తీసుకుందాం. యవనులు ఆల్ఫా (1), బీటా (2), గామా (3), డెల్టా (4),..., అయోటా (10), కప్పా (20), లాండా (30),..., రో (100), సిగ్మా (200), టౌ (300),... అంటూ వారి అక్షరాలనే అంకెలలా వాడేవారు. వీరి లెక్కింపు పద్ధతిలో సున్న లేదు. యవనులు I, II, III, IV, V, VI,...X,...,L,... ,C,... వగైరా గుర్తులు వాడేవారు. వీరి లెక్కింపు పద్ధతిలోనూ సున్న లేదు. సున్న లేకపోవడం వల్ల ఈ రెండు పద్ధతులతోను లెక్కలు చెయ్యడం చాల కష్టం. "ఏమీ లేదనే భావానికి కూడ ఒక మాట, ఒక గుర్తు ఉండాలనే ఊహ తట్టడం వల్లనే భారతీయ గణన పద్ధతి ప్రపంచవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. మూల పదార్థాల జాబితాకి శూన్యాకాశాన్ని చేర్చడం కూడ అంకెలకి సున్నని చేర్చడం లాంటి పనే అని నా అభిప్రాయం. ఈ రకపు ఆలోచనకి వెనక ఉన్న తర్కాన్ని సూచిస్తాను.

విశ్వానికి మూలం నీరు, మట్టి, గాలి, నిప్పు అనగానే సరిపోతుందా? వీటిల్లో దేనికి పెద్దరికం ఇవ్వాలన్న సమస్య ఎదురయింది. ఈ సమస్యని అరిస్టాటిల్ (Aristotle, క్రీ. పూ. 381-322) అనే తత్త్వవేత్త పరిష్కరించేరు. విశ్వానికి మధ్యలో భూమి ఉందన్నారు ఆయన. ఈ భూగోళం చుట్టూ ఆవరించుకుని జలగోళం ఉందన్నారు. భూమి మీద మనకి కనిపించే చెరువులు, సరస్సులు, నదులు, సముద్రాలే ఈ జలగోళం అంటే. ఈ జలగోళం చుట్టూ వాయుగోళం ఉందన్నారు. భూమిని ఆవరించుకుని ఉన్న వాతావరణమే ఈ వాయుగోళం. ఈ వాయుగోళం చుట్టూ అగ్ని గోళం ఉందన్నారు. అప్పుడప్పుడు వాయుగోళానికి చిల్లు పడితే, ఆవల ఉన్న అగ్ని గోళమే మనకి మెరుపుల రూపంలో కనిపిస్తుందని అరిస్టాటిల్ వాదించేరు. అగ్ని గోళానికి బయట ఏమి ఉంది? ఏమీలేదు. ఏమీ లేకపోవడమేమిటి? ఖాళీ ఉంది కదా! ఆ ఏమీ లేని ఖాళీ ప్రదేశాన్నే – సున్నతో పరిచయం ఉన్న మనవాళ్లు - "ఆకాశం" అన్నారని నా అభిప్రాయం.

ఇలా పంచ భూతాలనీ ఊహించుకుంటే పంచభూతాలలో భూమిది కేంద్ర స్థానం అయింది. అంతే కాదు. మట్టిలో మాణిక్యాలు దొరుకుతాయి. పంటలు పండుతాయి. పుట్టి గిట్టిన ప్రతి జీవీ చివరికి మట్టిలోనే కలుస్తుంది. కనుక "నేను ఎవరిని?" అనే ప్రశ్నకి మట్టిలోనే సమాధానం దొరకొచ్చు అని కొందరు ఆశించేరు. మట్టిలో దొరికే వాటిల్లో బంగారానిది అగ్రస్థానం. కర్మ పరిపక్వం చెందేవరకు పునర్జన్మలు ఎత్తి, చివరికి మోక్షం సాధించినట్లు, మట్టిలో దొరికే ఇనుము వంటి నాసి రకం పదార్థాలు అంచీల మీద బంగారంగా మారతాయని కొందరు వాదించేరు. పుణ్యం చేస్తే స్వర్గానికి వెళతాము. మరి ఏమిటి చేస్తే ఇనుము బంగారంగా మారుతుంది? పుటం వేసి చూడమన్నారు. పసరు రాసి చూడమన్నారు. పరుసవేది (Philosopher's stone) స్పర్శతో క్షుద్ర లోహాలు బంగారంగా మారుతాయనే నమ్మకం ప్రబలింది. ఉద్భటారాధ్య చరిత్రం అనే గ్రంథంలో, 16 వ శతాబ్దం వాడైన, రామకృష్ణ కవి ఒక చోట ఇలా అంటాడు: "పరుసము సోకిన లోహము బంగారముగా మారినట్లు ఉద్భటుడనే ఆ సద్గురుని మహిమ కారణంగా వసుధలోని జనులంతా సంపన్నులయారు." ఇది "హంస పాలనీ, నీటినీ వేరు చేసి పాలనే తాగుతుంది" అనే కవిసమయం వంటిదైనా కావచ్చు లేదా ఈ నమ్మకాన్ని - పదహారో శతాబ్దంలో కూడ - పట్టుకుని మనవాళ్లు వేల్లాడుతూనైనా ఉండి ఉండవచ్చు. ఏది ఏమైనా ఆ రోజుల్లో (సా. శ. 1000 నుండి 1450 వరకు) కనకం వైపు మానవుడి దృష్టి మళ్లింది. మళ్లి చలించింది. ఆ చలనంతో సత్యాన్వేషణ అనే చింత చెంత నుండి పోయింది. పురిటిలోనే సంధి కొట్టినట్లు విజ్ఞానశాస్త్రం వికసించే దశలోనే పెడతోవ పట్టింది. రసవాదమే అనండి. సువర్ణయోగమే అనండి. ఇనుము వంటి లోహాలని బంగారంగా



మార్చడానికీ, ఆకు పసరుని అమృతంగా మార్చడానికీ వ్యర్థమైన ప్రయత్నాలు చేసి తరతరాలు క్షోభించేడు మానవుడు. ఈ క్షోభే క్రమేపీ ఆధునిక రసాయన శాస్త్రానికి పునాది అయింది.

ఇనుము వంటి చవకబారు పదార్థాన్ని బంగారం వంటి మేలు రకం లోహంగా మార్చే పద్ధతిని గ్రీకు భాషలో "కిమియా" (khymea) అనే వారు. కిమియా అంటే పెద్ద రహశ్యం ఏమీ కాదు. ఇనుముని కొలిమిలో ఎర్రగా కాల్చడం. సుత్తితో బాదడం. ఏ పసరో పూయడం. మళ్లా కాల్చడం. మళ్లా బాదడం. పందిని ఏమి చేస్తే నంది అవుతుంది? కాని పేరాశతో పెన్నిధి వెతికేవాడికి హితోపదేశం చేస్తే అది బధిరశంఖ న్యాయమే అవుతుంది. కిమియా విషయంలో జరిగింది అచ్చంగా అదే. గ్రీకులు బంగారం చేసే రహశ్యం తెలుసుకుని ఏదో మెరిగిపోతున్నారన్న భ్రమతో అరబ్బులు ఈ విద్యని నేర్చుకుని వాళ్ల భాషలో "ఆల్ కిమియా" (al khymea) అన్నారు. మనం సంస్కృతంలో మాటలకి డు, ము, వు, లు అనే ఉత్తర ప్రత్యయాలు చేర్చి వాటిని తెలుగు మాటలు చేసుకున్నట్లే అరబ్బీలో "ఆల్" అనే పూర్వ ప్రత్యయం చేర్చాలి. కనుక గ్రీకు భాషలోని కిమియా కాస్తా అరబ్బీలో "ఆల్కిమియా" అయింది. అది ఇంగ్లీషులోకి వచ్చి "ఆల్‌కెమీ" (alchemy) అయింది. ఈ ఆల్‌కెమీ అనే మాటకి సమానార్థకమైన మాట "సువర్ణయోగం" అని నా నమ్మకం. ఈ సువర్ణయోగం సిద్ధించడం కోసం యోగి వేమన బాగా ప్రయత్నాలు చేసినట్లు ఆధారాలు ఉన్నాయి.

# జంట పావురాలు



చివటం సుబ్బారావు



ఏవండీ!... ఏవండోయ్!.... అబ్బబ్బా!..... మిమ్మల్నే!.... ఉదయాన్నే భార్యా మణి గొంతు నుండి వస్తున్న ఉదయ రాగం వరండాలో పేపరు చదువుతున్న శేఖర్ చెవికి తాకగానే తల అటువైపు తిప్పాడు ఏమిటా గోల అన్నట్లు ఇంత అరుస్తున్నా మీకు చీమకుట్టినట్లుగా లేదంటూ చేతిలో ఉన్న స్టీల్ గ్లాసుని వరండా వైపు విసిరి కొట్టింది రమ్య వరండా లో ఓ మూల గోడకు జారపడి మౌనంగా తపస్వినిలా కూర్చున్న సావిత్రమ్మ నుదటని తాకింది ఆ గ్లాసు ధ్యాన స్థితిలో ఉన్న ఆమె ఒక్కసారిగా ఉలిక్కిపడి చూసింది నెత్తురు లేని ఆ ముఖం లో మచ్చుకైనా చుక్క రాలేదు నెమ్మదిగా పమిట కొంగు తో అద్దుకుంది తన అసమ్మర్ధతతో జాలిగా తల్లి వైపు చూస్తూ రమ్యని అడిగాడు శేఖర్అబ్బబ్బా!...ఏమిటేఈగోలని ఔన్లేండి! నే నేం చేసినా మీకు గోలగానే ఉంటుంది ఆవిడ చేసిన పనులను వెనకేసుకు రావడం తప్ప అంతకన్నా ఏం చేస్తారు? నాకు అడిగే దిక్కు లేరనే గా మీ ఉద్దేశం అంటూ వంట గదిలో బోరుమంది. అబ్బా!...నా ఉద్దేశం అది కాదు రమ్యా! అసలేం జరిగిందని కింది పడిన గ్లాసుని తీసుకుని వంటగది వైపు నడిచాడు శేఖర్ ఏమయిందా!?...మీ కంటికి కనబడ్డంలేదూ అంటూ తన భర్త చేతిలో ఉన్న టీ గ్లాసుని విసురుగా లాక్కొని చూడండీ ఎక్కడ మరకలు అక్కడే ఉన్నాయి కడుపు నిండా భోజనం పెడుతున్నాం టైం కి టీ ఇస్తున్నాం టిఫిన్ పెడుతున్నాం నేనేం తక్కువ చేస్తున్నానండీ గట్టిగా అడిగితే అత్తగారిని ఆడిపోసుకుంటుందనీ నలుగురూ నన్నాడిపోసుకోవాలా ! అప్పుడు ఈవిడ మనసు చల్లబడద్దా ! అయ్యో రామా! ఆ వేళ మీ అమ్మనీ నాన్నని మీరే వృద్ధాశ్రమంలో జాయిన్ చేస్తానంటే వద్దండీ మీరు మావయ్య గారిని జాయిన్ చేస్తే జాయిన్ చేయండి అత్తయ్య గార్ని జాయిన్ చేయవద్దు ఈమె నా తల్లిలాంటిది నాకు అమ్మా లేదూ నాన్నాలేడూ ఆమెలో నా తల్లిని చూసుకుంటానని మీ కాళ్ళు పట్టుకుని బ్రతిమలాడాను

కానీ ఇప్పుడు తెలిసింది నేనెంత తప్పు చేసానా అని

శేఖర్ రమ్య కన్నీళ్ళను తుడుస్తూ ఆగు అంటూ వరండాలో మౌనంగా ఉన్న తల్లి వైపు నడిచాడు ఆవేశంతో

ఛీ! ఛీ! నువ్వు ఈ కాస్త పనికూడా చేయకపోతే ఇంకెందుకు గద్దించాడు శేఖర్

లేదు బాబూ! నిన్నటి నుండి జ్వరం ఏమీ తినలేదు రా! చేతులు వణుకుతున్నాయి సహకరించడం లేదు బాబూ! అందుకే కాస్త సరిగా అంట్లు కడగలేక పోయాను నన్ను క్షమించు నాన్నా! అంటూ ఆమె వణుకుతూ కొడుకు చేతులు పట్టుకుంది అన్నీవింటున్నరమ్యమాత్రంఏమి విన్నట్టు నటిస్తోంది

కన్నా! ఒక్క సారి నాన్నని చూడాలనుందిరా నాన్నని చూసి నాలుగు సంవత్సరాలయింది ఒక్కసారి చూపించగలవా !?జాలిగా అతని వైపు చూసింది అది పట్టించుకున్న రమ్య జాగర్త గా ఈ రోజే తీసుకెళ్ళి అక్కడ వదిలేసి రండి ఈ కుంపటి ఇకపై మనమీద పెట్టుకోవద్దు ఇక నావల్ల కాదంటూ తేల్చిచెప్పేసింది రమ్య

ఆమె వైపు దీనంగా చూస్తూ నీ...ఋణం తీర్చుకోలేను తల్లీ! అంటూ చిన్నగా నవ్వుతూ నమస్కరించింది సావిత్రమ్మ.

రామాపురం ఊరి శివార్లలో ఒక శిథిలమైన భవంతి ముందు ఆటో ఆగింది

సావిత్రమ్మని చేయి పట్టుకొని నెమ్మదిగా ఆటోనుండి దించాడు శేఖర్ భవంతిలోకి ప్రవేశించే సన్నటి కాలిబాట పిచ్చిమొక్కలతో మూసి వేయబడింది బహుశా ఆ బాటలో నడిచే వాళ్ళు లేక అనుకుంటా తుప్పు పట్టిన గేటుని నెమ్మదిగా త్రోసి తల్లిని తీసుకుని లోపలికి అడుగు పెట్టాడు శేఖర్ భవంతి కింద భాగం ఇరుకైన గదుల్లో అక్కడక్కడా జీవితంలో ఓడిపోయి అలసి సొలసి పోయి సేదతీర్చుకుంటున్న అభాగ్యులు నెమ్మదిగా అటు వైపు బయలు దేరాడు తల్లిని చేయి పట్టుకొని ఎవరో తనని లాగినట్లనిపించి వెనక్కి చూసాడు శేఖర్ చేయి చాపి జాలిగా శేఖర్ వైపు చూసాడు ఆ వృద్ధుడు కనీసం పెద్దవాళ్ళ దగ్గరకూ పసి పిల్లలు దగ్గరకూ వెళ్ళేటప్పుడు తినడానికి ఏమైనా తీసుకెళ్ళే గొప్ప సంస్కృతి మన భారతీయ సంస్కృతి శేఖర్ కి అవేమీ అబ్బలేదనుకుంటా అందుకే దులుపేసుకుని వెళ్ళి పోయాడు అక్కడ నుండి ముందుకు ఏడవ నెంబర్ గది దగ్గర ఆగిపోయాడు

నాలుగు సంవత్సరాల క్రితం చూసినప్పటికీ ఇప్పటికీ తన తండ్రి లో చాలా మార్పులు కన్పించాయి

ఇచ్చే దాతలు లేక పోషణ కరువైనట్లుంది ఆ" వృద్ధాశ్రమం" తైల సంస్కారం లేక ముడతలు పడి మాసిన గెడ్డం తో చినిగి కంపుకొడుతున్న గుడ్డలతో ఆ ఇరుక గదిలో కూర్చుని అతను ఇటువైపే చూస్తున్నట్లుంది నెమ్మదిగా అమ్మని దగ్గర జేర్చి నాన్నా ! అని పిలిచాడు శేఖర్ సత్యమూర్తి కను రెప్పలు ఆ పిలుపుని వెతికాయి చూపులేని ఆ కళ్ళు వాళ్ళని గమనించలేక పోయాయి సావిత్రమ్మ ఒక్క సారిగా సత్యమూర్తి వొడిలో వాలిపోయింది భార్య స్పర్శని గ్రహించిన తాను సావిత్రీ!....ఇంకెప్పుడూ నిన్నొ దిలి ఒక్క క్షణం కూడా నేనుండలేను అంటూ ఆమెని తాను కౌగిలిలో బంధించి కున్నాడు ఉప్పొంగిన హృదయంతో ఆదృశ్యం చూచిన శేఖర్ కి ఒక్కసారిగా-హృదయం ద్రవించింది తను చేసిన తప్పుని తెలుసుకుని ఇటువంటి పరిస్థితి ఏ తల్లితండ్రులకూ రాకూడదని ఇద్దరినీ ఇంటికి తీసుకు పోవాలనే దృఢ నిశ్చయంతో వాళ్ళని పైకి లేవదీయబోయాడు అప్పటికే ఆ ఇద్దరూ స్పర్శని కో ల్పో యా రు తిరిగి రాని లోకాలకు స్వేచ్ఛగా ఎగిరి పోయాయి ఆ... ఆత్మలు రెండూ జంట పావురాల్లా....



# హృదయ (ని) వేదన



హైమవతీ సత్య

కొండలెక్కినా కోట్లు ముడుపులు కట్టి నా
దేవుడు కనిపించడు కాని మనస్ఫూర్తిగా దణ్ణం పెట్టుకుంటే
కోరిన కోర్కెలు నెరవేరుస్తారని
చిన్నప్పుడు అమ్మ నాన్నమ్మలు చెప్పిన మాటలతో
కల్లోనైనా దేవుని చూడాలనే కోరిక
నాలో బలీయంగా నాటుకుపోయింది
కాలం కదిలిపోతుంది గాని ఆ కోరిక తీరలేదు
అమాయకంగా అడిగాను అమ్మని
కలలో దేవుడు కనబడలేదు
అంతటా తానుండలేకే తన ప్రతిరూపంగా
దేవుడు అమ్మని సృష్టించాడని చెప్పింది
ఒక్కసారిగా దేవునిపై కోపం వచ్చింది
ద్వేషం కలిగింది దైవాన్ని చూచే
భాగ్యంమనిషికి లేనపుడు
కంటి కెదురుగా దైవ స్వరూపంలా ఉన్న
అమ్మని చూచే భాగ్యం కూడా లేకుండా
పుట్టుకతోనే నన్ను "అంధుడి"గా పుట్టించినందుకు

# సంభాషణ సంస్కృతం

డాక్టర్ . చిలకమర్తి దుర్గాప్రసాద రావు



**Lesson—7/1**

**క్రియాపదాల బహువచన రూపాలు**

क्रियापदानां बहुवचनरूपाणि

**(plural forms of verbs)**

ప్రపంచంలోని భాషలన్నిటిలో ఏకవచనం బహువచనం ఈ రెండే ఉన్నాయి . కాని సంస్కృత భాషలో ద్వివచనం కూడ ఉంది .

బాలక: పఠతి                బాలకౌ పఠత:                బాలకా: పఠంతి

ప్రారంభదశలో ఈ ద్వివచనాన్ని వదిలేద్దాం . తరువాత నేర్చుకోవచ్చు . ఒకవేళ మనం ద్వివచనం వాడ-వలసిన అవసరం వస్తే ద్వయం అనే పదం ఉపయోగించి మరో విధంగా చెప్పుకోవచ్చు . ఉదా:- ఇద్దరు బాలురు చదువుతున్నారు అని చెప్పడానికి బాలకద్వయం పఠతి అని ఏకవచనంతోనే సరిపెట్టవచ్చు .

| Singular number | Plural number |
|---|---|
| (स:) స: (అతడు ) | (ते) (తే) వారు |
| (सा) సా (ఆమె) | (ता: ) (తా: ) వారు |
| (बालक:) బాలక:(బాలుడు) | (बालका: ) బాలకా: (బాలురు) |
| ( बालिका ) బాలిక | ( बालिका: ) బాలికలు |
| ( भवान् ) నీవు | (भवन्त:)=మీరు |
| (भवती ) నీవు | ( भवत्य: ) మీరు |
| \| | \| |
| 1. पठति పఠతి | पठन्ति ( పఠంతి) |
| 2.लिखति లిఖతి | लिखन्ति లిఖంతి |
| 3. क्रीडति క్రీడతి | क्रीडन्ति క్రీడంతి |
| 4. पश्यति పశ్యతి | पश्यन्ति పశ్యంతి |

5. दर्शयति दర్శయతి दर्शयन्ति దర్శయంతి

6. वदति వదతి वदन्ति వదంతి

7. गच्छति గచ్ఛతి गच्छन्ति గచ్ఛంతి

8. पिबति పిబతి पिबन्ति పిబంతి

9. पाययति పాయయతి (త్రాగించుట) पाययन्ति పాయయంతి

10. नृत्यति నృత్యతి नृत्यन्ति (నృత్యంతి)

11. गायति గాయతి गायन्ति గాయంతి

12. पृच्छति పృచ్ఛతి पृच्छन्ति పృచ్ఛంతి

13. नयति నయతి नयन्ति నయంతి

14. आनयति ఆనయతి आनयन्ति ఆనయంతి

15. पोषयति పోషయతి पोषयन्ति పోషయంతి

16. मापयति మాపయంతి मापयन्ति మాపయంతి

17. तोलयति తోలయతి तोलयन्ति తోలయంతి

18. ज्ञापयति జ్ఞాపయతి ज्ञापयन्ति జ్ఞాపయంతి

19. प्रक्षालयति ప్రక్షాళయతి प्रक्षालयन्ति ప్రక్షాళయంతి

20. करोति కరోతి कुर्वन्ति కుర్వంతి

21. ददाति దదాతి ददति దదతి

22. पूजयति పూజయతి पूजयन्ति పూజయంతి

बालक: पठति (Boy is reading) बालका: पठन्ति (Boys are reading)

పైన పేర్కొన్న క్రియా పదాలను ఉపయోగించి వీలైనన్ని వాక్యాలు తయారు చెయ్యండి

**Lesson—7/2**

दिनचर्या

ప్రతివారికీ ఉదయం నిద్రనుండి లేవగానే దినచర్య మొదలౌతుంది . ఉదాహరణకి ఒక వ్యక్తి దిన-చర్య ఎలా ఉంటుందో తెలుసుకుందాం . గంగాధర్ అని నా మిత్రుడొకడున్నాడు . అతని కొడుకు గౌతమ్. అతని దినచర్య ఈ విధంగా ఉంటుంది .

गङ्गाधरस्य पुत्र: गौतम: (Gautama is the son of Gangadhar)

स: (He)

पञ्चवादने---उत्तिष्ठति (**gets up at 5oclock 5 గంటలకు నిద్ర లేస్తాడు** )

सार्धपञ्चवादने—दन्तधावन: करोति (**brushes his teeth at 5.30 . ఐదున్నరకి ముఖం కడుక్కుంటాడు** )

षड्वादने ---क्षीरं पिबति ( **drinks milk at 6oclock ఆరుగంటలకు పాలు త్రాగుతాడు** )

सार्ध षड्वादने --- व्यायामशालां गच्छति (**goes to gymnacium at 6.30 ఆరున్నరకు వ్యాయామశాలకు వెళ్ళును** )

सप्तवादने – -- स्नानं करोति ( **takes bath at** 7 **o clock ఏడింటికి స్నానం చేస్తాడు** )

सार्धसप्तवादने ---पूजां करोति (**worships God at** 7.30 **-ఏడున్నరకు పూజ చేసుకుంటాడు** )

अष्टवादने --- अल्पाहारं स्वीकरोति ( **eats breakfast at 8oclock-ఎనిమిదింటికి అల్పాహారం తింటాడు** )

नववादने --- पुस्तकं पठति (**reads book at 9oclock-తొమ్మిదింటికి పుస్తకం చదువుతాడు** )

दशवादने ---पाठशालां गच्छति (**goes to school at 10 o clock- పదింటికి బడికి వెడతాడు** )

पञ्चवादने ---ग्रन्थालयं गच्छति( **goes to library by 5o clock- ఐదింటికి లైబ్రరీకి వెడతాడు** )

षड्वादने--- देवालयं गच्छति (**goes to temple at 6 o clock (ఆరింటికి గుడికి వెడతాడు** )

सप्तवादने गृहम् आगच्छति ( **comes home by 7o clock ఏడింటికి ఇంటికొస్తాడు** )

अष्टवादने पाठ्यपुस्तकानि पठति ( **reads class books at 8oclock ఎనిమిదింటికి పుస్తకాలు చదువు-తాడు** )

दशवादने निद्रां गच्छति (**goes to bed by 10 o clock-పదింటికి పడుక్కుంటాడు** )

**మీరు కూడ మీ దినచర్యను వివరిస్తూ పది వాక్యాలు సంస్కృతంలో చెప్పండి . తప్పులొస్తాయని సం-దేహించకండి .**

**Lesson** 7/3.

संख्या – **11—50**

**గతం లో మనం ఒకటి నుంచి పది వఱకు నేర్చుకున్నాం . ఇప్పుడు పదకొండు నుంచి ఏబది వరకు అంకెలు ఎలా ఉంటాయో తెలుసు కుందాం**

**11-** एकादश **ఏకాదశ 12-** द्वादश **ద్వాదశ 13-** त्रयोदश **త్రయోదశ 14-** चतुर्दश **చతుర్దశ**

**15-** पञ्चदश **పంచదశ 16-** षोडश **షోడశ 17-** सप्तदश **సప్తదశ 18 -**अष्टादश **అష్టాదశ**

**19 -**नवदश **or** एकोनविंशतिः **నవదశ (లేక) ఏకోనవింశతి: 20-** विंशति: **వింశతి:**

**21-**एकविंशति: **ఏక వింశతి: 22-** द्वाविंशति: **ద్వావింశతి: 23-** त्रयो विंशतिः **త్రయోవింశతి:**
**24 -**चतुर्विंशति: **చతుర్వింశతి: 25 -** पञ्चविंशतिः **పంచవింశతి: 26-** षड्विंशति: **షడ్వింశతి:**
**27-** सप्तविंशतिः **సప్తవింశతి: 28-** अष्टाविंशतिः **అష్టావింశతి: 29-** नवविंशतिः
**నవవింశతి: 30 -** त्रिंशत् **త్రింశత్**

**31-**एकत्रिंशत् **ఏకత్రింశత్ 32-** द्वात्रिंशत् **ద్వాత్రింశత్ 33-** त्रयस्त्रिंशत् **త్రయస్త్రింశత్**
**34 -**चतुस्त्रिंशत् **చతుస్త్రింశత్ 35-** पञ्चत्रिंशत् **పంచత్రింశత్ 36-** षट्त्रिंशत् **షట్త్రింశత్**
**37-** सप्तत्रिंशत् **సప్తత్రింశత్ 38-** अष्टत्रिंशत् **అష్టాత్రింశత్ 39 -** नवत्रिंशत् **నవత్రింశత్**
**40 –** चत्वारिंशत् **చత్వారింశత్**
**41-**एकचत्वारिंशत् **ఏకచత్వారింశత్ 42 -** द्विचत्वारिंशत् **ద్విచత్వారింశత్**
**43 -** त्रिचत्वारिंशत् **త్రిచత్వారింశత్ 44 -** शतुश्चत्वारिंशत् **చతుశ్చత్వారింశత్**
**45-** पञ्चचत्वारिंशत् **పంచచత్వారింశత్ 46 -** षट्चत्वारिंशत् **షట్చత్వారింశత్**
**47-** सप्तचत्वारिंशत् **సప్తచత్వారింశత్ 48-** अष्टचत्वारिंशत् **అష్టచత్వారింశత్**
**49-** नवचत्वारिंशत् **నవచత్వారింశత్ 50 –** पञ्चाशत् **పంచాశత్**

**Lesson-7-4**
द्वितीया विभक्ति:
**(Acquisitive case) ద్వితీయావిభక్తి**

**Normally in active voice object is in acquisitive case.**
**Subject-----object-------Verb**

**కర్తరి ప్రయోగం (active voice) లో కర్మ object ద్వితీయావిభక్తిలో ఉంటుంది.**
**ఈ విషయం మనం జాగ్రత్తగా గుర్తు పెట్టుకోవాలి**
बालक:------- पाठं/ पाठान् ------ पठति
**బాలుడు పాఠమును/పాఠములను చదువుతున్నాడు**
बालक: पाठं पठति **( Boy is reading a lesson)**
पाठं =**lesson** पाठान् = **lessons**
बालिका परीक्षां/ परीक्षा: लिखति **( Girl is writing an examination బాలిక పరీక్ష/పరీక్షలను వ్రా-**

యుచున్నది )

परीक्षा=(examination) परीक्षा:=(examinations)

राजा कविं /कवीन्  संमानयति ( king is honoring poet/poets రాజు కవిని/కవులను సన్మానించు-చున్నాడు )

माता शिशुं / शिशून् पश्यति ( Mother is seeing her child/ children తల్లి బిడ్డను /బిడ్డలను చూ-చుచున్నది )

भक्त: देवालयं  गच्छति ( A devotee is going to temple భక్తుడు గుడికి వెళ్ళు చున్నాడు )

बालक: क्षीरं  पिबति ( Boy is drinking milk బాలుడు పాలు త్రాగుచున్నాడు )

अध्यापक: प्रश्नं पृच्छति ( Teacher is asking a question ఉపాధ్యాయుడు ప్రశ్న అడుగుతున్నాడు )

बालक: पुस्तकं/पुस्तकानि  नयति (Boy is taking book/booksబాలుడు పుస్తకం /పుస్తకాలు తీసికెళ్ళు చున్నాడు )

पिता वैद्यं आनयति ( Father is bring a doctor తండ్రి వైద్యుని తిసికొస్తున్నాడు)

माता पुत्रं प्रेषयति ( Mother is sending her son తల్లి కుమారుని పంపించు చున్నది)

**Lesson-7/5**

कृपया –ददातु (Request)

( కృపయా అనే పదం చేరిస్తే అది ప్రార్థన (request) - చేర్చకపోతే అది ఆజ్ఞ (order)

भवान् कृपया भवत: लेखनीं ददातु ( మీరు దయతో లేఖిని ఇవ్వండి- Please give your pen)

भवती कृपया मम पुस्तकं आनयतु (Please bring my book మీరు దయతో నా పుస్తకం తీసుకు రండి )

भवान् कृपया मम वचनं शृणोतु ( మీరు దయతో నా మాట వినండి  please listen to my word)

भवती कृपया पुस्तकं पठतु ( దయచేసి పుస్తకం చదవండి please read the book )

कृपया गच्छतु (దయచేసి వెళ్ళండి please go)

कृपया खादतु (దయచేసి తినండి  Please eat)

कृपया पिबतु (దయచేసి త్రాగండి Please drink)

***********

కంఠస్థం చెయ్యవలసిన శ్లోకం -- 6

निन्दन्तु नीतिनिपुणा: यदि वा स्तुवन्तु
लक्ष्मीस्समाविशतु गच्छतु वा यथेष्टम्
अद्यैव वा मरणमस्तु युगान्तरे वा
न्याय्यात्पथ: प्रविचलन्ति पदं न धीरा:

**No matter, whether people who are experts in moral science may blame or praise, Lakshmi , the Goddess of wealth may go or come as she wishes, and death may happen either today or after the end of the Yuga ( in far off future) great people will never deviate a step from the right path.**

**నిందంతు నీతినిపుణా: యది వా స్తువంతు**
**లక్ష్మీ: సమావిశతు గచ్ఛతు వా యథేష్టం**
**అద్యైవ వా మరణమస్తు యుగాంతరే వా**
**న్యాయ్యాత్పథ: ప్రవిచలంతి పథం న ధీరా:**
**(నీతిశతకం -భర్తృహరి:)**

**నీతిశాస్త్రకోవిదులైనవారు నిందించినా లేక స్తుతించినా; లక్ష్మి(సంపదలు) వరించినా లేక విడిచి-పెట్టినా ఆ రోజే మృత్యువు సంభవించినా లేదా మరోయుగంలో సంభవించినా ధీరులైన వారు ఎట్టిపరిస్థితులలోను ధర్మమార్గం నుండి పైదొలగరు . ధర్మం తప్పరు అని సారాంశం**

# కాశీక్షేత్రం




ఆచార్య మత్స్యరాజ హరగోపాల్

బెనారస్(కాశి) పేరు వినని భారతీయుడు ఉండడు. చారిత్ర కంగా, పౌరాణికంగా, ఇతిహాసికంగా కూడా అతి ప్రసిద్ధమైనది కాశీక్షేత్రం. ఈ క్షేత్రవర్ణన, మహాత్మ్యాదులు వేద పురాణాదుల్లో విపులంగా తెలపబడినాయి. శ్రీనాథుడు మొదలగు మహాకవు లెందరో ఆంధ్ర వాఙ్మయమున ఈ క్షేత్రాన్ని గురించి వ్రాశారు. బెనారస్, కాశీ, వారణాసి పర్యాయపదాలు. శంకర భగవానుని త్రిశూలంపై ఈ నగరం నిలిచి ఉందని కొందరంటారు. కొన్ని పురాణాలు దీన్ని వైష్ణవ క్షేత్రంగా కూడా పేర్కొన్నాయి. 'వరణ్' 'అసి' అనే రెండు నదుల మధ్య ఉన్నందువలన ఈ ప్రదేశానికి వారణాసి అని పేరు కలిగినదట. ఇక్కడ చనిపోయినవారి జీవికి తత్త్వజ్ఞానంకలుగుతుందనిబ్రహ్మ స్వరూపం ప్రకాశితమౌతుందని చెప్పడంవల్ల దీనికి కాశీ అని పేరు కూడా స్థిరపడిరది.

అయోధ్యా, మధుర, మాయ,
కాశీ కాంచి అవంతికా

పురి ద్వారావతి చైవ సప్తైత
మోక్షదాయిన




అంటూ సప్త మోక్ష పురులలో కాశీ కూడా ఒకటని చెప్పబడిరది. పురాతన భారతదేశంలోనూ నేడు కూడా ఇది విద్యాకేంద్రంగా ఉంటూ వస్తున్నది. ద్వాదశ జ్యోతిర్లింగాలలో వైద్యనాథ జ్యోతిర్లింగం ఇక్కడనే ఉన్నది. అంతేగాక భారతదేశమందలి ఏబది యొక్క శక్తి పీఠాల్లో ఒకటి (మణికర్ణికకు వద్ద ఉన్న విశాలాక్షి) ఇక్కడ ఉంది. ఇవి కాశీనగర పౌరాణిక విశేషాలు.

కాశీనగరంలో గంగానది సర్వదా ప్రవహిస్తూ ఉంది. నదీ తీరంలో నిర్మితమైన ఘాట్స్లెక్కకు మిన్న. అందులో 1. వరుణ సంగమ ఘాట్, 2. పంచ గంగ ఘాట్, 3. మణికర్ణిక ఘాట్, 4. దశాశ్వమేధ ఘాట్, 5. ఆసీ సంగమ ఘాట్పేర్కొనదగినవి. ముఖ్యంగా యాత్రికులంతా మణికర్ణికు ఘట్టమందే స్నానాలు చేస్తుంటారు.

కాశీనగరంలో ఉన్న మందిరాలు కూడా కోకొల్లలు ముఖ్యంగా దర్శింపదగినవి. శ్రీ విశ్వనాథ మందిరం అతి ప్రధానమైన మందిరమిది. మందిరంపైన స్వర్ణకలశం ఉన్నది. చరిత్ర

ప్రసిద్ధుడైన మహారాజా రంజితసింహుడు దీనిని విశ్వనాథునకు అర్పించాడు. మందిరం ముందు భాగంలో సభామండపం ఉన్నది. మండపానికి పశ్చిమభాగంలో దండ పాణీశ్వర మందిరం ఉన్నది. మండపంలో పెద్ద గంట ఒకటున్నది. మందిర ప్రాంగణంలో ఒకవైపు సౌభాగ్య గిరి,గణేశమందిరాలు,మరొకవైపు శృంగార గౌరి, అభిముక్తేశ్వర, సత్యనారాయణ మందిరాలు ఉన్నాయి. శనేశ్వరేశ్వర మహాదేవ మందిరం కూడా ఉన్నది. మందిరంలో ఉన్న శివలింగం జ్యోతిర్లింగం. దక్షిణ దేశంలో అత్యున్నతమైన శివలింగాలను మనం చూస్తాం(ఉదాహరణకు కంచి). కానీ కాశీలోని శివలింగం చాలా చిన్నది. ఇక్కడ శివలింగపు క్రింది భాగం (దీన్ని జలహారి అంటారు) శంఖు ఆకారంలో గాక చతురస్రాకారంలో ఉన్నది. అందువల్ల నీరు వెళ్లడానికి మార్గం లేదు. చెంబులతో నీటిని బయటకు తీసి వేస్తుంటారు. ఈ మందిర ప్రాంగణంలో ఒకవైపు సుమారు ఒక వంద ఏబది శివలింగాలు ఉన్నాయి. కాశీ విశ్వనాథమందిరమే గాక అన్నపూర్ణ మందిరము భూత భైరవ మందిరము మొదలుగా గల మందిరాలు ఎన్నో ఉన్నాయి.

ఒక మాటలో చెప్పాలంటే కాశీలోని ప్రతి స్థలంలో ఏదో ఒక దేవాలయంలో మనకు కనపడుతుంది.

కాశీపురం జైనులకు కూడా పుణ్యక్షేత్రం. ఏడవ తీర్థంకరుడైన పాశ్వనాథుడు, ఇరువది మూడవ తీర్థంకరుడైన పాశ్వనాథుడు ఇక్కడే జన్మించాడు. వీరి మందిరాలు కాశీలో ఉన్నాయి. అనేక మైన జైన చైత్యములు, జైనమందిరములు ఉన్నాయి ఇక్కడ. 'భదైనీ' అనే ప్రదేశాలలో జైనుల స్యాద్వాది విద్యాలయం ఉన్నది.


నేడు కాశీనగరంలో చూడదగిన స్థలములు చాలా ఉన్నవి. ఇక్కడి హిందూ విశ్వవిద్యాలయం మదనమోహన మాలవ్యా గారిచే స్థాపించబడినట్టిది. విశ్వవిద్యాలయ ఆవరణంలో యుగల్కిషోర్బిర్లా గారిచే నిర్మితమైనట్టి విశాలమైన విశ్వనాథమందిరం కూడా ఉన్నది. కాశీలోని భారతముని మందిరం కూడా దర్శనయోగ్య మైనట్టిది. దగ్గరలోనే సంకటమోచన హనుమాన్మందిరంకూడా ఉన్నది. కాశీ విద్యాపీఠం కూడా ఇక్కడే ఉన్నది. కాశీనాగరి ప్రచారిణి సభ, భారత దర్శ మహామండలము క్లిమ్స్కాలేజి, సరస్వతి భవన పుస్తకాలయం మొదలుగా గలవి చూడదగినట్టివి. ఈ నగర సమీపంలోనే కాశీరాజు నివసించే రామనగరం ఉంది.

కాశీలో నేటికి కూడా ప్రపంచ ఖ్యాతి గాంచిన మహాపండితులు జ్యోతిష్యాస్త్రవేత్తలు, వేదవేదాంగ పారంగతులు ఎందరో ఉన్నారు. వీరి దర్శనార్థం కూడా ఎందరో వెళుతుంటారు. నేడు గంగానదిలో నౌకాయానం ద్వారా గంగానది కాశీక్షేత్ర గంగాఘాట్లన్నీ కూడా దర్శింపవచ్చు. సాయంకాలం గంగాహారతి తప్పకుండా చూడవలసినది.

హైదరాబాద్, కొత్త ఢిల్లీ నుండి, ఖజురహోల మొదలగు ప్రాంతముల నుండి బెనారస్కు వాయుమార్గం ఉంది. హైదరాబాద్, కొత్త ఢిల్లీ నుండి రైలు మార్గం కూడా ఉంది. బెనారస్పట్టు పరిశ్రమకు కూడా కేంద్రం కూడా. ఈ విధంగా అనేక విధాలుగా ప్రపంచ విఖ్యాతి గాంచిన కాశీ నగరాన్ని దర్శింపడానికి భారతీయులే కాదు విదేశీయులు కూడా వస్తుంటారు. త్రివిధ తాపాలను దూరం గావించి మానవునికి శాంతిని ఆహ్లాదాన్ని సర్వతోముఖమైన ఔన్నత్యాన్ని ప్రసాదించి హిందూ క్షేత్రాలలో వారణాసిపురం యొక్క స్థానం అత్యున్నతమైనది. ముఖ్య దార్శనిక స్థలాలకు బస్సును నడుపుతారు. ఒక్కరోజులో వాటిని యాత్రికులు సందర్శించవచ్చు.

కాశి ఆలయ చరిత్ర

* క్రీ.శ 1835లో స్వర్ణ తాపడం చేయించిన మహారాజా రంజిత్సింగ్



* కాలక్రమంలో గృహ నిర్మాణాలతో ఆక్రమణకు గురైన ఆలయ ప్రాకారం

* ప్రతిరోజు జ్యోతిర్లింగ దర్శనం కి తరలి వచ్చే వేలాది భక్తులు చిన్నచిన్న గల్లీలు దాటుకొని ఆలయానికి అసౌకర్యంగా చేరుకునేవారు

* కాశీ పూర్వ వైభవానికి ఉత్తరప్రదేశ్ప్రభుత్వ సంకల్పం

* 184 ఏళ్ల తర్వాత 2019 మార్చి 8 న ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్దాస్మోడీ 1000 కోట్లతో కాశీ విశ్వనాథ్ఆలయం పునర్నిర్మాణం కోసం కాశీ విశ్వనాథ్కారిడార్ప్రాజెక్టు శంకుస్థాపన.

* 12 ఎకరాల లో నూతన కారిడార్నిర్మాణం.

* కారిడార్నిర్మాణం కోసం 300కు పైగా నివాసాలను,1400 వ్యాపార సముదాయాలను ఒక్క కోర్టు కేసు లేకుండా తొలగింపు.

* మణికర్ణికా ఘాట్నుంచి నేరుగా ఆలయానికి చేరుకునే విధంగా నిర్మాణం.

* కారిడార్అవతలివైపు జ్ఞానవాపి మసీదు ఉండేలా డిజైన్.

* విశ్వనాథుని సన్నిధికి చేరుకునేందుకు సప్త ద్వారాలు.

* ఆలయ ప్రాంగణంలో ఆదిశంకరాచార్య మరియు అహల్యాబాయివిగ్రహాలఏర్పాటు.

* ఆలయ పునర్నిర్మాణం రెండున్నర సంవత్సరాలలో పూర్తి చేసి రికార్డు సృష్టించిన ఉత్తర ప్రదేశ ప్రభుత్వం.

* 2021 డిసెంబర్13 సోమవారం రోజున భారతదేశ ప్రధానమంత్రి, కారణజన్ముడు, యుగపురుషుడు, మన హిందువులందరికీ ఆరాధ్య మైనవాడు శ్రీ శ్రీ శ్రీ నరేంద్ర దామోదర్దాస్మోడీ దివ్య కాశి-భవ్య కాశి కారిడార్ప్రారంభోత్సవం చేసినారు.

శ్రీ విశ్వనాథ్కారిడార్ప్రారంభం అయిన తరువాత రోజు 60 వేల మంది పైగా భక్తులు దర్శనానికి వస్తున్నారు.

# ఆత్మనివేదనం



ఆదూరి హైమవతి

"బామ్మా బామ్మా! త్వరగా వచ్చేసి తొమ్మిదో కథ చెప్పేయి. నాస్నేహితులకు చెప్పాలి."అంటూ వచ్చి బామ్మ దగ్గర కూర్చుంది కుమారి. కార్తీక మాసానికని వత్తులు చేసుకుంటున్న బామ్మ చిరునవ్వుతో " రా!బంగారు తల్లీ! చెప్తాను. విను "

అంటూ మొదలు పెట్టింది.

మనం చెప్పుకుంటున్న నవవిధ భక్తిమార్గాల్లో చివరిదిదైన ' 'ఆత్మనివేదనం 'అంటే మనోవాః కాయకర్మలతో తనను తాను భగవంతునికి అర్పించుకొడం అన్నమాట. అర్పించుకోడం అంటే మనసంతా ఆభగవంతునికి అర్పించి నిరంతరం భగవత్ ధ్యానంతో అన్నిపనులూ చేసుకుంటున్నా ఆయనను మనస్సులో స్మరిస్తూ ఉండటం.

సరే అనగా అనగా అనంతవరం అనే గ్రామంపక్కనే ఉన్న చిన్నపాటి అడవిలో ఒక పురాతన అన్నపూర్ణమ్మతల్లి ఆలయం ఉండేది,ఆఆలయంలో పరమ శివుని లింగం ఉన్నా ,అంతా అమ్మకే ఎక్కువగా మొక్కుకునేవారు.అన్నపూర్ణమ్మ కనుక తమకు తిండీ తిప్పలకు కరువు ఉండదని జనం భావించేవారు. అలా ఆ ఆలయకీర్తి చుట్టుపక్కల పరగణాలకు వ్యాపించింది. అంతా బండ్లుకట్టుకుని వచ్చి అమ్మనుపూజించి అక్కడే చెట్లక్రింద భోజనాలు వండుకుతిని సాయంకాలానికి వెళ్లేవారు. ఆఅలయ పూజారి సుదర్శనయ్య భార్య సుందరమ్మ అన్నపూర్ణమ్మ



తల్లి ఆలయంలో పూజలు చేస్తూ ఉండేది. ఇరువురూ దేవతల పూజలో పునీతులై నిరంతరం దైవ ధ్యానంలో గడిపేవారు. భక్తులు సమర్పించుకునే దక్షిణ, పూజాద్రవ్యాలు, కొబ్బరికాయలూ, పండ్లూ ఫలాలతో వారి బత్తెం గడచిపోయేది. ఆలయం పక్కనే చిన్న గుడిసె వేసుకుని నివసించేవారు. వారికి ఆలయ పూజ దైవస్మరణ తప్ప మరేధ్యాసాలేదు

ఇలాఉండగా ఒకమారు విపరీతమైన కరవు వచ్చి, వానలేక జనాలకు తిండే కరువైపోయింది. ఎవ్వరూ ఆలయానికేసి వచ్చినవారేలేరు.పూజారి దంపతులకు ఏం చేయాలో పాలుపోలేదు. అమ్మకు, అయ్యవారికీ నైవేద్యం పెట్టను ఏమీ లేక చాలా బాధ పడసాగారు.

చుట్టుపక్కల అడవుల్లో లభ్యమయ్యే కాయలు, పండ్లూ, పూలూతెచ్చి ఎలాగో పూజాదికాలు




నైవేద్యాలూ చేసి, విచారంగా జీవించసాగారు. పూర్వం అంగరంగవైభోగంగా ఉండే దేవాలయం ఇలా నిర్మానుష్యంగా ఉండటం, తమకూ అమ్మ, అయ్యవారల శేష వస్త్రాలు లేక చిరిగి చీర, పంచలనే కుట్టుకుని కట్టుకున్నా తమగురించీకాక ఆలయానికి ఇలా సందడిలేక సందర్శకులు లేక ఉండటం వారిని చాలా బాధించింది .

నిత్యం ఆలయం లో దేవుని ముందుకూర్చుని ఇరువురూ కంటికి కడివెడుగా దుఃఖిస్తూ" అమ్మా ! మావల్ల అపరాధం జరిగితే మన్నించు. వర్షం వచ్చి జనం సుఖ సంతోషాలతో కడుపునిండా తింటూ పూర్వంలా ఆలయానికి వచ్చి మిమ్ము సేవించుకునేలాగా చేయ్యండి తల్లీ!' అనిమనస్సులో స్మరిస్తూ అడవిలో దొరికే కాయా పండూ, దుంపా నైవేద్యం పెట్టి అదే భుజిస్తూ జీవమున్న కర్ర ల్లా సన్నబడిపోయి దిగులుతో కృశించిపోయారు.

వారు ఒక నిర్ణయానికి వచ్చారు. వర్షం వచ్చే వరకూ నిరాహారంగా ఉపవశిస్తూ, కేవలం సివునికీ అమ్మకూ అభిషేకిచిన జలం మాత్రమే త్రాగాలని నిశ్చయించుకున్నారు. అలాచేయడం ప్రారంభించారుకూడా. ఒక మాసం అయ్యేసరికి వారు ఇంకా చిక్కి శల్యించిపోయి కదిలే శక్తికూడాలేకుండాపోయింది. ఆరోజు రాత్రి చీకటి కమ్మి నీలమేఘాలు చిక్కని మబ్బులు వచ్చి కుండపోతగా వర్షం కురిసి ఊరూ వాడా నీటితో నిండిపోయాయి.

అలా మూడు పగళ్ళూ మూడు రాత్రూలూ వర్షం కురిసి నదులూ చెరులూ పొర్లి పారాయి. జనమ్మతా వానతగ్గగానే ఆలయదర్శనా నికి రాగా అక్కడ స్పృహలేకుండా దేవునిముందు పడివున్న పూజారి దంపతులను చూసి వారి చేతుల్లో ఉన్న ఉద్ధరిణలను చూసి, జరిగింది గ్రహించారు. వారిరువురినీ మంటపంలో పడుకో బెట్టి కొద్దిగా పాలు నోట్లో పోస్తూ సేవచేసాకమూడు రోజులకు వారు కదిలారు.


గర్భగుడిముండీ వారికి ఒక స్వరం వినిపించింది."భక్తులారా! మీకు మూడు సంవత్సరాలు కరువుకాటాకాలు ఉన్నాయి. ఐతే ఈ పుణ్య దంపతుల భక్తి వారు మాకోసమేకాక మీ అందరికోసం తపించి తమను తాము అర్పించుకున్నందున వర్షం కురిసిందీ' ఆస్వరం విని అంతా పూజారి దంపతులకు భక్తితో నమస్కరించి వారికి సదు పాయాలన్ని చేశారు. తిరిగి ఆలయం పూర్వ స్థితికి వచ్చి నిత్యకల్యాణం పచ్చతోరణంగా చాలా కాలం వెలుగొందింది. 'ఇదమ్మా కుమారీ ఆత్మనివేదనం అంటే.

"బామ్మ నాకు బాగా అర్థమైంది. ఎవరైతే తమకోసం కాక జనులందరికోసం నిస్వార్థంగా ప్రార్థిస్తారో వారికోరికను భగవంతుడు తప్పక వింటాడు., అని" ఓకే బామ్మా! నకౌ నవవిధ భక్తిమార్గాలను గురించీ చక్కగా చెప్పావు. ఇహ మాజట్టుదే గెలుపు. థ్యాంక్యూ "అంటూ పరుగు లంఘించుకుంది కుమారి.

***

# మాతృదేవో భవ

శ్రీమతి నిర్మల




మాతృత్వం అనేది ఓ తీయని అనుభూతి. తల్లి కావడంలో ఓ అందమైన అనుభవం. తల్లి అనిపించుకోవడంలో ఎంతో ఆనందం. దానితోపాటు మరెన్నో బాధ్యతలు కూడా అల్లుకొని ఉంటాయి. అటువంటి ఆత్మీయ అనురాగంతో కూడుకున్న అమ్మతనంలోని మాధుర్యాన్ని గురించి ఎంత చెప్పినా ఇంకా చెప్పాల్సి ఉంటూనే ఉంటుంది. ప్రతి సంవత్సరం మే నెలలో వచ్చే రెండవ వారాన్ని (మదర్స్ డే) మాతృ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. అమ్మ అనే మాటలోని కమ్మదనం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆ పదఉచ్చారణతోనే మన మదిలో ఉద్విగ్నత, ప్రేమ భావం ఉప్పొంగుతాయి. ఈ ప్రపంచంలోకి రాకముందే తల్లి గర్భమే మన నివాసం. 9 నెలల పాటు మానవుడు తల్లి గర్భంలో ప్రాణం పోసుకుని జీవించడానికి అవసరమైన మేధా అవయవాలను పెంపొందించుకుంటాడు. ఈ ప్రక్రియలోని పవిత్రత పరమాత్మ సమానమైంది. జన్మించిన తర్వాత తండ్రి పరిచయం అవుతాడు. ఇది కాక ఆచార్యుడు(గురువు) పరిచయం అవుతాడు. మనిషి తల్లిలోని శరీరం అంతర్భాగమై ఎదిగి అమ్మలోని కమ్మదనాన్ని ఆస్వాదిస్తాడు. కనుకనే ఆచార్యుని కన్నా, తండ్రి కన్నా, తల్లి స్థానం మూలమైంది. ఈ భూమిపై మనుగడ సాగించడానికి అమ్మ తన బిడ్డకు అర్హత కలిగిస్తుంది. ఈ శరీరం ద్వారా ఇహ లోకంలోనూ పరంలోనూ ఏది సాధించినా... మనిషికి ప్రాతిపదిక తల్లి. ధర్మశాస్త్రాలలో తల్లి పాత్ర చాలా ప్రధానమైనది, ప్రశంసనీయమైంది. ఆమెలోని విశిష్టమైన ఉదాత్త భావాలు సంతానానికి వస్తాయి. అయితే శాస్త్రకారులు తల్లిని విధూషీమణి, త్యాగమయి, అనురాగమయి కావాలన్నారు. ప్రేమమయిని, స్నేహితురాలిని, శ్రేయోభిలాషిని, ఆహార ప్రధాతను, రక్షకురాలును, మీదు మిక్కిలి జ్ఞానదాతను ఒకే మూసలో పోసి దేవుడు కరుణాతిశయంతో మనిషికి సమర్పించిన అపురూపమైన వరం తల్లి. సంతానాన్ని నిర్మించే శక్తిని పరమాత్ముడు తల్లికి వరంగా ప్రసాదించాడు. తల్లి తన బిడ్డలకు సత్యమైన ఉపదేశమే ఇస్తుంది. తల్లి నుంచి సంతానానికి లభించే ఉపదేశం, ఉపకారం మరి ఎవరి వలనా లభించదు. తల్లి చూపే ప్రేమ, మమకారం, హితం మరి ఎవరు చూపరు. అమ్మ ఎంత మంచిదంటే అందరి బాధలకి నివారణోపాయంగా ఉండే తను, తనకి


ఒంటి బాధ ఏమైనా వస్తే పిల్లలు చేత చేయించుకోవడానికి ఇష్టపడదు. అయితే పచ్చి నిజం ఒకటి. అమ్మ తన పిల్లలందరినీ ఒకే విధంగా ఒకే ఇష్టంతో సమానంగా పెంచినా, ఆ పిల్లలందరూ అమ్మను ఒకే ఇష్టంతో చూడనే చూడరు. ఎంత ఘోరం మాతృత్వానికి ప్రత్యామ్నాయం మరొకటి లేదు. కుటుంబ వాతావరణంలో అమ్మదే కీలక స్థానం. బాధ్యతాయుతంగా పిల్లల్ని పెంచడం అనేది ఎంతో త్యాగంతో కూడుకున్నది. దానికి విలువ కట్టలేం. పిల్లల పెంపకంలో కామాలు తప్పించి ఫుల్ స్టాప్‌లు లేవు. వారు ఏ వయసుకు ఎదిగినా అమ్మకు మాత్రం పిల్లలే. తల్లికి మించిన ఆత్మీయురాలు పిల్లలకు ఉండదు. తన పాలతో ఆరోగ్యం, ఆలోచనలతో, చేతలతో మానవత్వం, ప్రేమ, కరుణలను ఆ తల్లి అందిస్తుంది. ఆమె అద్భుతమైన శక్తి. ఆ శిల్పిని పరమాత్ముడు మానవ నిర్మాణం కోసం సమాజానికి అర్పించాడు. ఆమె భగవంతుడు పంపగా వచ్చిన దేవత. ఆ దేవత తన సంతోషాలను బిడ్డల కోసం త్యాగం చేస్తుంది. ఆ తల్లిని అర్థం చేసుకొని ఆమెను మనశ్శాంతిగా ఉంచడం బిడ్డల ధర్మమని నీతి శాస్త్ర కోవిదులు అన్నారు. త్రికరణ శుద్ధిగా తల్లిని సేవించి సత్కరించడమే పూజించడం. తల్లి విలువ తెలుసుకొని ఆమె మనసుకు బాధ లేకుండా ఎప్పుడు సంతోషంగా ఉండేటట్లుగా చూసుకోవడమే మన ధర్మం. భక్తుల కోసం భగవంతుడు ఎత్తిన అవతారాలు పది. పిల్లల కోసం తల్లి ఎత్తే అవతారాలు కోకొల్లలు. బిడ్డకు అమ్మ నడిచే ఓ భగవద్గీత. బైబిల్, ఖురాన్ లోకంలోని నవరత్నాలు మణి మాణిక్యాలు పోగు ఒకవైపు, పేగు బంధాన్ని ఇంకోవైపు ఉంచి ఒకదాన్నే ఎంచుకోమంటే ఏ తల్లి అయినా మొగ్గు చూపేది కన్నకడుపు పంట వైపే. ఏటికేడు ప్రపంచ వింతలు మారిపోవచ్చేమో కానీ తల్లి ప్రేమ మాత్రం సృష్టి ఉన్నంత వరకు చెక్కుచెదరకుండా సాగే అద్భుతం. అమ్మ అన్నది ఒక కమ్మని మాట. అది ఎన్నెన్నో తరగని మమతల మూట అన్నారో కవి. ఈ పాటలో ప్రతి అక్షరము అమ్మ ప్రేమను చాటి చెప్పేదే. వాస్తవంలోనూ, సృష్టిలోని ఇతర బంధాల కంటే అపురూపమైనది నిష్కల్మషమైనది ప్రలోభాలకు లొంగనిది తల్లీ బిడ్డల అనుబంధమే. తల్లి ప్రేమలో ఎంతచోటైనా దొరుకుతుంది. కానీ లోటు ఉండదు. బిడ్డ ఉన్నతికి దీటుగా పెరుగుతుందే తప్ప ఈర్ష్య అసూయలు దరిచేరనివ్వదు. వేదం కూడా మాతృదేవోభవ అంటూ తల్లికే ప్రథమ స్థానాన్ని ఇచ్చింది. మనం ఆమె గర్భంలో ఉన్నప్పుడు మనకు ఏ రుచి కావలసి ఉందో ఆ రుచిని అడిగితే తనకి ఆ రుచి అసహజమైన పుట్టబోయే మనకోసం తాను తిని వేవుళ్ళు తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి ఎంతో కష్టంతో నొప్పుల్ని భరించి ఇష్టంగా కన్నది అమ్మ. మనకి మొదటి బడి అమ్మవడి. మొదటి పాఠం ఒకరి కళ్ళలోకి ఒకరు చెప్పలేని ఆనందంతో మౌనంగా చూసుకోవడం. రెండవ పాఠం అమ్మ ముక్కుని తన బిడ్డ ముక్కుతో ఒత్తుతూ పెట్టుకొని ముక్కు ముద్దు. మూడవ పాఠం ఆటలు 'తారంగం తారంగం వేణునాథ తారంగం'. నాలుగో పాఠం పరిశుభ్రత కాలకృత్యాలని అసహ్యించుకోకుండా శుభ్రం చేయడం. ఇక ఐదో పాఠం ప్రకృతి పరిచయం 'చందమామ రావే'. 'నాన్న ఇదిగో', 'అమ్మమ్మ ఇదిగో', 'అక్క ఇదిగో' ఇలా ఇక బడి పూర్తిగా అయిపోయాక

చక్కని పాటని 'జో అచ్యుతానంద జోజో ముకుందా' అని పాడుతూ వీపు మీద అభయాన్ని స్తుతిస్తూ అరచేత్తో తట్టుతూ నిద్రపోయేలా చేయడం. పరోక్షంగా సంగీతాన్ని విని తన్మయత్వాన్ని తెచ్చుకోవచ్చుననే విషయం ఆ పసిపాపకు నేర్పడం. గర్భాన్ని ధరించింది మొదలు బిడ్డలు పూర్ణ విద్వాంసులయ్యే వరకు సుశీలతను బోధించే తల్లి ఎంతో ధన్యురాలు అని మహర్షి దయానంద సరస్వతులవారన్నారు. భారతీయ సమాజంలో తల్లి పాత్ర అద్వితీయమైంది. సంతానానికి సభ్యత, సంస్కారం తల్లి ద్వారానే కలుగుతాయి. ఏ విధమైన చెడు పనులు చేయకుండా తల్లి శిక్షణిస్తుంది చిన్నలతో, పెద్దలతో, తల్లితో, తండ్రితో అధికారులతో ఎట్లా మాట్లాడాలో తల్లి నేర్పిస్తుంది. అమ్మ కథ రాయమంటే చేయి తిరిగిన రచయిత కానక్కర్లేదు. మనకున్న కొడుకో కూతురో అయితే చాలు అంటారు. డాన్ నక్వీస్ అమెరికా రచయిత. అమ్మను తెలుచుకుంటే చాలు అద్భుతాలు జరిగిపోతాయి. ఆమె జీవితాన్ని మించిన గొప్ప కదేం ఉంటుంది. ఎక్కడో నాన్న ఇక్కడ గంపెడు పిల్లలతో అమ్మ తినడానికి మూడు రొట్టెలు తినవలసిన వారు నలుగురు. నాకు అక్కర్లేదు రా అనడం ఆమెకు కొత్త కాదు. 'ఎందుకో బాగా దాహం వేస్తుందమ్మా' అంటూ పడుకునే ముందు రెండు చెంబుల నీళ్లు గలగల త్రాగడం ఆమెకు కొత్త కాదు. ఫస్ట్ క్లాస్ మార్కులు, పెద్ద కాలేజీలో సీటు, ఫీజు కట్టడానికి డబ్బుండదు. హఠాత్తుగా అమ్మ చేతి బంగారు గాజులు మాయమవుతాయి. బంగారు కొండ సంతోషంగా బస్సు ఎక్కుతాడు. మట్టి గాజులు నవ్వుతూ వీడ్కోలు చెబుతాయి. పిల్లలు చిన్నప్పటి నుంచి ఇలా ఒక రకమైన పాసెసివ్‌నెస్‌తో వాళ్లను పెంచి వాళ్లతోడిదే లోకమన్నట్లుగా తనకంటు సొంత ప్రపంచాన్ని మిగిల్చుకోకుండా బతికే తల్లిదండ్రులు పిల్లలు పెరిగి పెద్దయిన తర్వాత తమను నిర్లక్ష్యం చేసి వృద్ధాశ్రమాల్లో చేర్పించడం లాంటిది చేసినప్పుడు దాన్ని తట్టుకోలేకపోతున్నారు. తమ వృద్ధాప్యంలో పిల్లల అండదండలు ఉంటాయనుకుంటున్న వారి అసలు ఆవిరైపోతున్నాయి. నిరాధరణకు లోనవుతున్నారు. ముసలితనంలో తిండి పెట్టేవారు కరువౌతున్నారు. ఎంత హృదయ విదారకం. మన వర్ధమాన కవుల రచనలు అమ్మను ఎంతగానో శ్లాఘిస్తున్నాయి. వారి ప్రకారం అమ్మంటే:

1. మాతృత్వం కూడా ఓ ఉద్యోగం అయితే ప్రపంచంలో అత్యంత జీతం అమ్మకే ఇవ్వాలి
2. దేవుడు సర్వాంతర్యామి అనడానికి ఒకటే సాక్ష్యం సృష్టిలోని ప్రతి జీవికి అమ్మ ఉంది.
3. జీవితాన్ని వరంగా ఇచ్చిన అమ్మకు ఏ బహుమతి ఇచ్చినా తక్కువే.
4. అమ్మ ఏ విషయమైనా రెండుసార్లు ఆలోచిస్తుంది ఒకసారి తన వైపు నుంచి మరోసారి బిడ్డ వైపు నుంచి.
5. చిన్నప్పుడు చలికి వణికి పోతుంటే వెచ్చని దుప్పటి కప్పి కాపాడుతుంది. పెద్దయ్యాక సమస్యలతో శతమతమవుతుంటే ప్రార్థనతో కాపాడుతుంది అమ్మ .
6. అమ్మ ముద్దుల వెనకే కాదు దెబ్బల వెనక అపారమైన ప్రేమ ఉంటుంది.
7. అమ్మ! మళ్లీ 100 సార్లు నీ కడుపున పుట్టినా ` తీరుతుందా నీ రుణం ` లక్షరెట్లు పెరుగుతుంది కానీ...!

కని పెంచిన అమ్మకు శత సహస్ర కోటి వందనాలు

# చైతన్యం గళ్ళ నుడికట్టు - 14



## ఆధారాలు-అడ్డం

1) సర్వే జనాః .......
4) చిగురాకులలో చిలకమ్మ ఏం చేయాలమ్మా
9) మడత పెట్టు
10) నాటేందుకు తయారు చేసిన మొక్కలు
11) వెల
13) స్థానము, అట్నుంచి
15) మృదుత్వము
16) పంక్తిలో
18) విక్రయము, అట్నుంచి
19) ఒకటి పాయింట్ ఆరు కి మీ
20) మూడు అయిదులు
22) సంతాపము
23) ఎల్లప్పుడు
24) నేతలు ఇచ్చేది
26) పరిమితి
27) మేఘం
29) అరలో అర, అట్నుంచి
30) ఇంకా ఎక్కువ
32) ఆలోచించిన
34) విష్ణు మూర్తి
36) నేత్రము, అట్నుంచి
37) దానము
40) వెలుగు, అక్షరాలు తడబడ్డాయి
41) తేడా
43) నవనీతము, అట్నుంచి
45) మన్ను
46) శక్తి
47) కృష్ణుడు
48) ఒక చెట్టు
49) మహా పాపము
52) అయిదు
53) గాడిద
54) జరిగిపోయిన
56) గోనె
57) చిన్న మందు ఉండ, అట్నుంచి
58) ధన ..
59) పవనము, అట్నుంచి
60) అభ్యంతరాలు
61) ప్రమాదం, అట్నుంచి
63) అనురాగము
65) ప్రకాశించునది
66) దంతము
69) బుద్బుదము, అట్నుంచి
70)మోక్షకామి
71) అదృష్టం ఉంటే .......
74) ఒక పప్పు
77) ఇటు కాదు,
78) వెళ్ళి
80) మారు
81) కావాలని పెట్టుకునే కయ్యాలు
82) సముద్రము, అక్షరాలు తడబడ్డాయి
84) స్త్రీ
86) నడిపించువాడు
87) సూర్యుడు
88) కాటుక, అక్షరాలు తడబడ్డాయి

## ఆధారాలు–నిలువు

1) సువాసన
2) నోచేది
3) పుట్టుక లేనివాడు, అక్షరాలు తడబడ్డాయి
4) చిన్న
5) ఆవకాయ లాంటిదే
6) రంధ్రము
7) వస్త్రములు
8) స్వప్నములో
10) నవ్విన ... పండదా
12) వక్రము
14) హాయి
15) పచ్చి మోసం
17) పాండవులలో చివరివాడు
19) ఒక పిండి
20) జాగరూకము
21) మార్గశిర, పుష్య మాసములు......
25) బంధం, అట్నుంచి
26) కాసిని
27) అభిమానము
28) ఆఫ్రికాలో ఒక దేశం, అట్నుంచి
30) సోమరి
31) ఏనుగు, అట్నుంచి
33) గిరీశానికి అందని మిఠాయి పొట్లం ఎక్కడుంది
34) యుద్ధంలో మ్రోగించే వాద్యం
35) అల్పము
37) ఎక్కువ
38) ఒక జిల్లా
39) కోరిక
42) మృదుత్వము, అట్నుంచి
44) దుఃఖము
47) శుచిత్వము
48) కరీమునగరు జిల్లాలోని పుణ్యస్థలం
50) కార్మికులు పనిచేసే చోటు
51) .. జపము →
52) వీటికి పోతే పనులెలా జరుగుతాయి
53) స్వరము
55) 69 నిలువు లోని రచయిత అపూర్వ రచన
56) లంగోటి
62) అరగతీయడానికి ఉపయోగించేది
64) మోక్షం, అట్నుంచి
65) రచనలు ఆస్వాదించు లక్షణం
67) బలము, అట్నుంచి
68) .... భోగంగా, అట్నుంచి
69) శివరాజు వెంకట సుబ్బారావు గారి కలం పేరు
72) .. మాలిక్, అట్నుంచి
73) .... కొలువు ఈయవయ్య రామా
75) పక్కలో కుట్టేది
76) ఇలా నవ్వండి
79) దుష్ట ప్రవర్తన కలిగినవాడు
80) వింత
83) సముద్రము
85) శృతి, ..

## చైతన్యం గళ్ల నుడికట్టు –13 సమాధానాలు

| | | | | | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| శు | భా | రం | భం | | కో | వె | ల | | గా | లి | ము | ర | లు | | | శాం | డి | |
| | ను | | డా | ల | రు | | బ | | రి | | | చ్ఛ | ప | | | త | | |
| నే | డు | | ర | | కొం | డం | త | వె | లు | గు | | | చే | తి | చ | ము | రు | |
| రే | | క్యా | ము | ల | డ | | | | | గ్గి | గు | లం | | | మ | | నీ | లం |
| డు | | | | కో | | | | కం | బ | ళ్ళు | | | | స | త్యా | రం | | కం |
| | | స | గ | టు | | | వి | ది | డి | | జ | డ | | నా | ర | | | త |
| క | ర | డి | | పో | ట్ల | గి | త్త | | పం | | | | | న | ము | టి | త | కొం |
| ని | | సి | న | | | | ము | లు | తు | గ | ర | | పో | త | | కం | తా | ప |
| క | రి | య | | | టు | | | | లు | | యా | చ | క | ము | | | | |
| ర | | కో | డి | పం | దా | లు | | | | చే | త | | | | ఆ | | క | ఈ |
| ము | | గా | ము | ల | | ష్ట | స | | పొం | త | న | | క | మ | లా | స | ను | డు |
| | తో | లి | | బ | | ము | త్య | ము | | న | | | బా | | ప | | ప | |
| నై | లు | | సా | | | | భా | | | ము | క్కు | పొ | డి | | న | ము | పా | |
| | త | క్ష | కు | డు | | ము | మ | నా | | | టు | | | | | ఖా | | మా |
| | | ణి | | వా | ణి | | | గ | ద్ద | | చి | క్కి | నా | | | ము | చ్ఛ | ట |
| క | టు | కా | | | | ము | క్ష | రి | | వి | | | రి | | స | ఖీ | | కా |
| ళిం | | వే | లు | పు | | | | క | | ము | ర | యూ | కే | | ద | | వ | రి |
| గ | న | శ | | ష్య | | | ము | త | చి | ఖ | | | ళ | | స్సు | ర | స | |
| ము | | ము | | మి | క్కి | లి | | | | త | ట | స్థ | ము | | | | తి | ప్ప |

# వింత పరీక్ష

**లక్ష్మీదేవి**

ఒక రాజుకు ఇద్దరు భార్యలు.ఇద్దరికీ చెరొక కొడుకు ఉండేవారు. కొంతకాలానికి పెద్దభార్య చనిపోయింది.రాజు కొడుకులిద్దరూ యుక్తవయసు లోకి వచ్చారు.రాజు తన పెద్ద భార్య కొడుకునియువరాజుగా చేసే ఆలోచనలో వుండటం గ్రహించి చిన్నభార్య ఎలాగయినా అతని పీడ వదిలించు కోవాలని తనకొడుకుకే రాజ్యం వచ్చేట్లు చేయాలని తలపెట్టి రాజుతో పెద్దబ్బాయి నీ రత్నగిరి రాజకుమార్తె ను పెళ్లాడి రమ్మనండి అన్నది . రత్నగిరి రాజకుమార్తె ను పెళ్లాడతానికి వెళ్లి తిరిగి వచ్చిన వాళ్ళు లేరు .అయినా చిన్నాభార్య చేతిలో కీలబొమ్మగా మారిన రాజు అందుకు సమ్మతించాడు. రాజకుమారుడు కూడా రత్న గిరి రాజకుమార్తె గురించి విని వున్నాడు.అందులో ప్రమాదం వున్నదని చూచాయగా తెలుసు.అయినా అతడు సాహసి అందువల్ల తండ్రి చెప్పిందే తడవుగా సరేనన్నాడు. అతడు రత్నగిరి రాజ్యం ప్రవేశించి ఒక సత్రం లో దిగి రాజకుమార్తె ను గురించి విచారించాడు. తనను పెళ్ళాడ గోరిన వారిని ఏదో కష్టమైన పని చెపుతుందని ఆపని చెయ్యటానికి సిద్ధ పడిన వాడికి ఏదో పానీయం ఇస్తుందని అది తాగిన వాడు శిల అయిపోతాడు అని అలా శిల అయిన వాళ్ళను ఒక సొరంగం లో పడేస్తుందని అతనికి తెలియ వచ్చింది. అతను రాజకుమార్తె ను పెళ్లాడ వచ్చాదనితెలిసి కొందరు ఎందుకు బాబు అనవసరంగా శిల అయిపోతావు మీదేశం వెళ్లి ఎవరినైనా పెళ్లాడి సుఖం గా వుండు. అని అతనికి హితం చెప్పారు. కానీ రాజ కుమారుడికి ఆహితం నచ్చలేదు . అందరూ అనుకుంటున్న ది చాలా అసహజం గా వున్నది. రాజకుమార్తె ఏమి పని చెపుతుంది. అది నిజంగా మానవ మాత్రులు చెయ్యలేనిపని అయితే వారిని శిలలు గా మార్చ వలసిన పని ఏముంది ఆమె ఇచ్చిన పానీయాన్ని వాళ్ళు ఎందుకు తాగుతారు . ఇలాంటి అనుమానాలు రాజకుమారునీ బాధించాయి. ఆ అనుమానాలు తీర్చుకొన కుండా అతను వెళ్ళ దలుచుకోలేదు. అతను రాజ భవనానికి వెళ్లి రాజకుమార్తె ను కలుసుకుని నిన్ను వివాహ మాడాలని వచ్చాను అన్నాడు. నన్ను వివాహ మాడాలంటే ఒక రాక్షసుడి తల తేవాలి ఆరాక్షసుడి వివరాలు చెబుతాను శ్రద్ధగా విను. సప్త సముద్రాల అవతల నీల పర్వతం వుంది ఆ పర్వతం లో ఒక గుహ నించి పొగ వస్తూ వుంటుంది. .ఆపొగలో దూరి లోపలకు వెళితే ఒక రాక్షసుడు కనిపిస్తాడు వాడి తల నరికి తీసుకు రావాలి ఏ నిద్ర. లోనో వుండగా నరికి తేవచ్చు .అనుకోకు. వాడి ప్రాణం ఒక చిలకలో వుంది . ఆచిలుక అక్కడికి తూర్పుగా వున్న ఎఱ్ఱ కొండ మీద ఒక చెట్టు తొర్రలో వున్నది.దాన్ని చంపి రాక్షసుడి తల తేవాలి అన్నది రాజ కుమార్తె. అలాగే తెస్తాను అన్నాడు రాజకుమారుడు.అయితే నేను ఒక పానీయం ఇస్తాను పని సాధించే శక్తి నీలో వుంటే ఈ పానీయం నిన్నేమీ చెయ్యదు. లేని పక్షంలో నువ్వు శిల అయిపోతా వు .నువ్వు తాగటానికి నిరాకరిస్తే నిన్ను సొరంగం లో బందిస్తాను. అన్నది రాజ కుమార్తె. రాజ కుమారుడు పానీయం తాగుతా నన్నాడు. రాజ కుమార్తె పానీయం తెచ్చి ఇచ్చింది.అతడు దాన్ని తాగాడు. అతను శిల అయిపోలేదు. నేను శిల అయిపోలేదు కాబట్టి నేను సాధించుకు వస్తాను అని బయల్దేరాడు. ఆగు ఎక్కడికి పొనవసరం లేదు .పరీక్ష అయిపోయింది .ఇప్పటివరకు ఈ పానీయాన్ని ఎవరూ తాగలేదు వారంతా సొరంగం లో వున్నారు అన్నది రాజకుమార్తె. రాజకుమారుడు వైభవం గా రత్నగిరి రాజకుమార్తె ను పెళ్లాడాడు. భార్యతో వచ్చిన తన సవతి కొడుకుని చూసి చిన్న భార్య హతాసురాలయింది. రాజు తన పెద్దకొడుకు ను యువరాజుగా అభిషేకించాడు.



# కర్ణాటకలో ప్రచార జోరు




ప్రజాస్వామ్య పతాక..
ఆత్మగౌరవ ప్రతీక
సుపరిపాలనా వేదిక
డా॥ బి.ఆర్.అంబేడ్కర్
తెలంగాణ రాష్ట్ర సచివాలయం
గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్‌రావు గారి
చేతులమీదుగా ప్రారంభోత్సవం
30 ఏప్రిల్ 2023, హైదరాబాద్
అనతికాలంలోనే అన్ని రంగాలలో అద్భుతమైన ప్రగతిని సాధిస్తూ దేశానికి దిక్సూచిగా నిలిచింది తెలంగాణ రాష్ట్రం. సంక్షేమంలో స్వర్ణయుగాన్ని సృష్టిస్తూ, అభివృద్ధి పథంలో అగ్రగామిగా పరుగులు తీస్తున్నది. నూతన సచివాలయ భవనానికి భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పేరుపెట్టి యావద్భారత దేశం ముందు గొప్ప ఆదర్శాన్ని ముందుంచింది. అధునాతనమైన సచివాలయం వేదికగా తెలంగాణ ప్రజల సేవకు పునరంకితమవుతున్నది తెలంగాణ ప్రభుత్వం.
విశేషాలు
• తెలంగాణ రాష్ట్ర ప్రతిపత్తిని చాటే విధంగా ఆరు అంతస్తుల భవనం • అడుగడుగునా అద్భుతమైన వాస్తు కౌశలం ఉట్టిపడేలా నిర్మాణం
• అత్యాధునిక సాంకేతిక అంశాలతో అనుసంధానం • సువిశాలంగా ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారుల కార్యాలయాలు
• పచ్చదనం అలరారే విధంగా పరిసరాలు • ప్రతి అంతస్తులో సమావేశమందిరాలు • ఉద్యోగులకు సౌకర్యవంతమైన వసతులు
• పర్యావరణ హిత నిర్మాణం, సౌరవిద్యుత్తు వినియోగం • సువిశాలమైన పార్కింగ్
తెలంగాణ ఆచరిస్తున్నది.. దేశం అనుసరిస్తున్నది
భవన విశేషాలు
మొత్తం స్థలవిస్తీర్ణం
28
ఎకరాలు
నిర్మాణ విస్తీర్ణం
8,58,530
చదరపు అడుగులు
ప్రధాన భవనం నిర్మాణ విస్తీర్ణం
7,79,982
చదరపు అడుగులు
భవనం ఎత్తు
265
అడుగులు
6
అంతస్తులు
భవనం చుట్టూ పచ్చదనం
2 ఎకరాలు
ముందుభాగంలో పచ్చదనం
5 ఎకరాలు
జారీ చేసిన వారు: కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం